

జీవితంలో సరళమైన పనుల కోసం సమయాన్ని కేటాయించండి. నక్షత్రాలను గమనించడం, పక్షులను చూడటం, సూర్యోదయాన్ని లేదా సూర్యాస్తమయాన్ని వీక్షించడం, నడకకు వెళ్లడం, లేదా నిశ్శబ్దంగా మీ శ్వాసను గమనించడం వంటి-పైకి చాలా చిన్నవిగా అనిపించే-పనులను చేయండి.జీవితంలో ఎలాంటి సంఘటనలు లేదా పరిస్థితులు ఎదురైనా, మీ అంతరాత్మలో స్థి రంగా, నిశ్చలంగా ఉండండి. అప్పుడే మీరు నిజమైన ఆనందా న్ని, పరమానందాన్ని పొందగల రు.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ

www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 348 | సోమవారం | 19 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ‘5



# హోరెత్తిన సద్దుల సంబురం



## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

- ట్యాంక్‌బండ్‌పై 700 మంది కళాకారుల ప్రదర్శనల నడుమ హోరెత్తిన ఉత్సవం
- బతుకమ్మ ఆడిన గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క సినీనటులు రష్మిక, విజయ్
- బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని పెళ్లప్పుడే రష్మికకు చెప్పా.. తీసుకొచ్చా: విజయ్
- నేను తెలంగాణ కోడలిని.. అందుకే బతుకమ్మ ఆడేందుకు వచ్చా: రష్మిక
- కులమతాలకు అతీతంగా ప్రజలను ఒకచోటకు చేర్చే పండుగ: మంత్రి జూపల్లి



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** సూర్యుడు పడమట వాలుతుండగా ఆ నారింజ రంగుతో కూడిన చల్లని హాయి అయిన మలిసంధ్యకు మరింత అందాన్ని తెచ్చేలా.. తీరొక్క రంగులతో బతుకమ్మలు ఇళ్లలోంచి వీధుల్లోకొచ్చి ఓ చోట చక్కగా అలికి పరిచిన ముగ్గులపై కొలువుతీరాయి. వాటి చుట్టూ పట్టు పరికిణీలు, పట్టు

మిగతా 2 లో



# ఉక్రెయిన్ ఉగ్రరూపం

- ఉక్రెయిన్ దళాల భీకర యుద్ధం
- అతిపెద్ద వైమానిక దాడి
- ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు
- ఇంధన వ్యవస్థలే టార్గెట్
- మంటల్లో చమురు డిపోలు
- డేటా సెంటర్లపైనా దాడులు
- 1015 డ్రోన్లు కూల్చేశాం: మాస్కో
- ప్రతీకార దాడులు జరిపిన రష్యా
- ఉక్రెయిన్లోని జపోరిజియాపై ఎటాక్
- మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు

వివరాలు 4 లో

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూ పం దాల్చుతోంది. రష్యాపై ఆదివారం ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టింది. ఒకేరోజు వెయ్యికిపైగా డ్రోన్లతో భీకర దాడులు జరిపింది. కీవ్ బలగాలు చేపట్టిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని రక్షణ వర్గాలు వెల్లడించాయి. రష్యాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని భారీ డ్రోన్ దాడులు నిర్వహించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది.

# నవరాత్రుల వేళ ఘోర విషాదం



## మధ్యప్రదేశ్లోని గ్వాలియర్లో ఘోర ప్రమాదం

- నవరాత్రుల వేళ శీతలామాత ఆలయం వద్ద విషాదం
- 28 మందికి తీవ్ర గాయాలు.. విచారణకు ఆదేశించిన సీఎం

04

# ఫ్యూచర్ సిటీలోకి మహేశ్వరం ‘విలీనం’

- మొత్తం మండలం విలీనం దిశగా అడుగులు
- ప్రస్తుతం 2 గ్రామాలు మాత్రమే ఎఫ్‌సీడీఏలో.. మరో 32 గ్రామాలూ విలీనమయ్యే అవకాశం

02





# నేడు ఫ్యూచర్ సిటీకి సీఎం

- పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం..
- ఎన్ఐయుఎం క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం ఫ్యూచర్ సిటీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఫ్యూచర్సిటీ పోలీస్ కమి షనరేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత యాచారం మండలం మంగలితండా వద్ద నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ (ఎన్ఐయుఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనం తరం యంగ్ ఇండియా స్కిల్ వర్శిటీని సందర్శిస్తారు. ఆ ప్రాంగణంలోనే నిర్వహించబోయే ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి ఫ్యూచర్సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయా నికి చేరుకుని పనులపై సమీక్షించనున్నారు.



04

# అది రేవంత్ జాబ్ ‘రాకెట్’

- జర్మనీలో ఉద్యోగాలని నిరుద్యోగులకు ఆశలు
- ఒకొకరి నుంచి రూ.4.5 లక్షల వసూలు
- రెండేండ్లు గడిచినా ఇంకా దక్కని కొలువులు
- వసూలు చేసిన ప్రతి పైసా తిరిగి ఇవ్వాలి
- శ్వేతపత్రం ఇవ్వాలి : హరీశ్‌రావు డిమాండ్



04

# బాలీవుడ్ నటుడిపై దుండగుల కాల్పులు

## బాలీవుడ్ నటుడు ప్రయాణిస్తున్న కారుపై దుండగుల కాల్పులు

- టైగర్ సురక్షితం, అతని డ్రైవర్, మరొకరికి గాయాలు
- దాడి తమ పనేనని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటన
- సల్మాన్ తో పనిచేసిన వాళ్లని వదలబోమని హెచ్చరిక

# హోరెత్తిన సద్దుల సంబురం

మొదటి పేజీ తరువాయి

చీరల్లో నగల ధగధగలు, గాజుల గలగలతో యువతులు, మహిళలు చేరి ఆడిపాడారు. ఉయ్యాలో ఉయ్యాల అంటూ వారు అందుకున్న పాటలకు, కోలాటాల సందడికి, డీజేల మోతకు వీధులు హోరెత్తిపోయాయి. చీకట్లు కమ్ముకుంటుండగా మహిళలంతా బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి.. ఒడ్డున కూర్చుని సద్దులు తిని.. పాటలు పాడుకుంటూ ఇళ్లకు కదిలారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్నం అన్న తేడా లేకుండా ఇలా సంప్రదాయరీతిలో సద్దుల బతుకమ్మ సంబురాలు కన్నుల పండుగగా జరిగాయి! ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. విద్యుద్దీపాల అలంకరణల నడుమ పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యకారులు సహా 700 మంది కళాకారుల ప్రదర్శనలు, హుస్సేన్ సాగర్ అలలపై లేజర్ షో, తారాజువ్వలు దూసుకెళ్లడాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలకు గవర్నర్ శివప్రసాద్ శుక్లా, ఆయన సతీమణి జానకీ శుక్లా, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, మరోమంత్రి సీతక్క, ప్రముఖ సినీనటులు, కొత్త దంపతులు అయిన విజయ దేవరకొండ, రష్మిక, సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు వేడుకకు హాజరయ్యారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలను ప్రజలు, రైతులు తప్పకుండా పాటించాలని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రంగురంగుల పూలను ఒకచోటకు చేర్చి.. ఆ పూలతోనే అమ్మవారిని కొలిచే గొప్ప పండుగ.. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక చోటకు చేర్చి ఐకమత్యంగా ఉండాలనే సందేశాన్నిచ్చే వేడుక బతుకమ్మ అని జూపల్లి పేర్కొన్నారు. చెరువులు, చేలను పరిరక్షించుకోవాలనే సందేశాన్నిచ్చే పండుగ బతుకమ్మ అని సీతక్క అన్నారు. బతుకమ్మ ఆడటం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, ఆ రకంగా ఇది ఆరోగ్యాన్ని పరిరక్షించే పండుగ అని వివరించారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడారు. తనకు తెలంగాణ పండుగలు అంటే ఎంతో ఇష్టం అని.. అందులోనూ బోనాలు, బతుకమ్మ పండుగలంటే మరీ ఇష్టం అని చెప్పారు. ఫిబ్రవరిలో తమకు వివాహం జరిగిందని, తెలంగాణ పండుగల్లో ఒకటైన పెద్ద బతుకమ్మ పండగ ఎక్కడ జరిగితే అక్కడ బతుకమ్మ ఆడాలని రష్మికకు అప్పట్లోనే తాను చెప్పానని వెల్లడించారు. ఆ ప్రకారంగానే రష్మికను ట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో బతుకమ్మను ఆడించేందుకు తీసుకొచ్చానని చెప్పారు. అనంతరం రష్మిక మాట్లాడారు. తాను తెలంగాణ కోడలినని, ఆ రకంగా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాల్లో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. పెళ్లయ్యాక.. తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ పండగలో పాల్గొని బతుకమ్మ ఆడాలని విజయ్ తనకు చెప్పారని అందుకే ఈ బతుకమ్మ ఉత్సవాలకు తాను హాజరయ్యానని చెప్పారు. అప్పట్లో తనను అంతా మేడం అని పిలిచేవారని, తెలంగాణ కోడలినయ్యాక అంతా వదినా అని పిలుస్తున్నారని.. తన పట్ల ఈ అభిమానం ఎప్పటికీ ఇలానే ఉండాలని పేర్కొన్నారు. గవర్నర్ సతీమణి జానకీ శుక్లా, మంత్రి సీతక్క, రష్మిక బతుకమ్మ ఆడారు. హనుమకొండలో పద్మాక్షి ఆలయం వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో వేలసంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, ప్రసిద్ధ భద్రకాళి ఆలయ ప్రాంగణం, ఉర్సు కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటి లింగాల దేవాలయ ప్రాంగణం వద్దా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లా బోర్గాంలో బతుకమ్మ ఆడుతుండగా ఆ వైపు అంబులెన్స్ రావడంతో మహిళలు బతుకమ్మలను పక్కకు తీసి అంబులెన్స్‌కు దారి ఇచ్చి తమ బాధ్యతను చాటుకున్నారు.



### 4క్వింటాళ్ల పూలతో..

ఖమ్మం జిల్లా ప్రజలు. కూసుమంచి మండలం పెరికశింగారం గ్రామంలో 55 అడుగుల భారీ బతుకమ్మను పేర్చారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు- విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ అతి పెద్ద బతుకమ్మను తీర్చిదిద్దారు. ఈ బతుకమ్మ పేర్చడానికి నాలుగు క్వింటాళ్ల పూలు అవసరమయ్యాయి. 25 మంది పదిగంటల పాటు శ్రమించి బతుకమ్మను సిద్ధం చేశారు. గత 25 ఏళ్లుగా ఇక్కడ భారీ ఎత్తుతో బతుకమ్మను పేర్చడం ఆనవాయితీగా వస్తోంది. కాగా కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా విషాద ఘటన జరిగింది. ధర్మగల్ల స్వామి (40) అనే ఆర్టీసీ డ్రైవర్ కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలకు హాజరయ్యాడు. బతుకమ్మను నిమజ్జనం చేస్తుండగా కాలు జారడంతో స్వామి నీళ్లలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి అతడిని నీళ్లలోంచి బయటకు తీయగా అప్పగికే మృతిచెందాడు. స్వామికి భార్య శ్యామల, కుమార్తె, కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు.

# ఫ్యూచర్ సిటీలోకి మహేశ్వరం 'విలీనం'

**మొత్తం మండలం విలీనం దిశగా అడుగులు**

**ప్రస్తుతం 2 గ్రామాలు మాత్రమే ఎఫ్‌సీడీఏలో..**

**మరో 32 గ్రామాలూ విలీనమయ్యే అవకాశం**

**కందుకూరు మండలంలో మిగతా గ్రామాలూ..**

**మరింతగా విస్తరించనున్న ఫ్యూచర్ సిటీ**

**స్థానికుల విజ్ఞప్తులపై సర్కార్ సానుకూల స్పందన**

**రంగారెడ్డి కలెక్టర్‌కు ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం**

**త్వరలోనే ఆ గ్రామాల విలీనానికి నోటిఫికేషన్?**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్‌సిటీని మరింతగా విస్తరించేందుకు ప్రభుత్వ కసరత్తు కొనసాగుతోంది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలోని 71 గ్రామాలు ఫ్యూచర్ సిటీ డెవల్‌పమెంట్ అథారిటీ(ఎఫసీడీఏ) పరిధిలో ఉండగా.. మరిన్ని గ్రామాలను విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. అయితే, మహేశ్వరం మండలంలోని 32 రెవెన్యూ గ్రామాలు, కందుకూరు మండలంలోని మిగిలిన గ్రామాలను సైతం ఎఫ్‌సీడీఏలో చేర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఆయా గ్రామాల విలీనం పూర్తయితే మహేశ్వరం, కందుకూరు మండలాలు పూర్తిగా ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి రానున్నాయి. రాజధాని హైదరాబాద్‌కు సమీపంలోనే మరో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నూతన నగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దేశంలోనే మొదటిసారి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీని నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్‌ను సైతం సిద్ధం చేయడమే కాకుండా ఫ్యూచర్‌సిటీ డెవల్‌పమెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఎఫ్‌సీడీఏ పరిధిలో 71 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అయితే, మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో చేర్చాలంటూ స్థానికులు ఇటీవల సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు కందుకూరు, మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే, రాజకీయ పరిస్థితుల కారణంగా కొన్ని గ్రామాల నుంచి తీర్మానాలు అందకపోవడంతో విలీనంపై అధ్యయనం చేసి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని అన్ని గ్రామాలను ఎఫ్‌సీడీఏలో చేర్చేందుకు కసరత్తు ప్రారంభం కాగా.. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానుంది.

### హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏలోకి

ప్రస్తుతం ఎఫ్‌సీడీఏ పరిధిలో మహేశ్వరం మండలంలోని మొహబత్‌నగర్, తమ్మలూరు గ్రామాలు మాత్రమే ఉన్నాయి. మిగతా 32 రెవెన్యూ గ్రామాలైన అకన్‌పల్లి, ఆల్మసగూడ, అమీర్‌పేట, బాగ్‌మంఖాల్, దబిల్‌గూడ, దిల్వార్‌గూడ, దుబ్బచెర్ల, గంగారం, ఘట్‌పల్లి, గొల్లూరు, ఇమాంగూడ, కల్వకోల్, కోళ్లపడ్కల్, కొంగర కుర్దు, మహేశ్వరం, మలిక్దాన్‌గూడ, మంఖాల్, మన్‌సాన్‌పల్లి, మొహబ్బత్‌నగర్, నాగారం, నాగిరెడ్డిపల్లి, నందపల్లి, పెండ్యాల, పోరండ్ల, రావిర్యాల, సర్దార్‌నగర్, సిరిగిరిపూర్, శ్రీనగర్, సుభాన్‌పూర్, తుమ్మలురు, తుప్రాకుర్దు, వెంకన్నగూడను త్వరలో ఎఫ్‌సీడీఏలో విలీనం చేయనున్నారు. కందుకూరు మండలానికి సంబంధించి దాసర్లపల్లి, అన్మోజిగూడ, దెబ్బడగూడ, గూడూరు, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూర్, మాధాపూర్, మీర్‌ఖాన్‌పేట-బేగరికంచ, మహమదానగర్, ముచ్చర్ల, పంజగూడ, రాచులూరు, సార్వరావులపల్లి, తిమ్మాపూర్, మురళీనగర్, దన్నారం, చిప్పలపల్లి, నేదునూరు, అక్బర్జ, అలీఖాన్‌పల్లి, బాచుపల్లి, పెరుగడ్డ, పులిమామిడి, జైత్వారం కల్సా, జైత్వారం మక్తా గ్రామాలు ఫ్యూచర్‌సిటీ పరిధిలో ఉండగా.. మిగతా గ్రామాల విలీనానికి కసరత్తు చేస్తున్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని గ్రామాలన్నీ కూడా ఎఫ్‌సీడీఏలో విలీనమైతే.. లేఅవుట్ల అనుమతుల కోసం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మీర్‌ఖాన్‌పేట-బేగరికంచెలో ఉన్న ఎఫ్‌సీడీఏ కార్యాలయంలోనే అనుమతులు తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### మొదట 56 గ్రామాలతో మాస్టర్‌ప్లాన్

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని 56రెవెన్యూ గ్రామాల పరిధిలో... 30వేల ఎకరాల్లో....మొత్తం 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని తొలుత మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. కొన్ని రోజుల క్రితం మరో 15 గ్రామాలు విలీనం అయ్యాయి. వీటితో యాచారం మండలంలోని అన్ని గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి చేరాయి. దీంతో మొత్తం ఎఫ్‌సీడీఏ పరిధి ప్రస్తుతం 71 రెవెన్యూ గ్రామాలకు చేరింది. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలు విలీనం కానుండటంతో ఎఫ్‌సీడీఏ పరిధి మరింత విస్తరించనుంది. ఇప్పటికే ఎఫ్‌సీడీఏలో విలీనమైన గ్రామాల్లో ఉన్న నీటి వనరులు, భూములు, ఇళ్లు, తదితర లెక్కలు తీస్తున్నారు. సరిహద్దులను గుర్తించి మ్యాపులను సిద్ధం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, ఇళ్లతోపాటు ప్రభుత్వ, అటవీ, పట్టా భూములు, తదితర పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సన్నద్ధమవుతున్నారు.

# అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగానే వలసలు

**అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా వలసలుండాలి.**

**నా వ్యాఖ్యల్లో తప్పులు దొర్లి ఉండొచ్చు**

**విదేశీ నిపుణులను లక్ష్యంగా చేసుకోవాలన్నది ఉద్దేశం కాదు**

**అవసరమైన చోట వారికి స్వాగతం పలకాల్సిందే**

**భారత్ నుంచి వచ్చిన అత్త. మామలంటే ఎంతో ప్రేమ**

**అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్**



**వాషింగ్టన్ :** హెచ్1బీ వీసాలపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులను ఒప్పంద బానిసలు అంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వివరణ ఇచ్చారు. తన అభిప్రాయాల వ్యక్తీకరణలో లోపం ఉండొచ్చంటూనే.. వలస లపై తాను లేవనెత్తిన అంశాలను మాత్రం సమర్థించుకున్నారు. హెచ్1బీ వీసాదారులను కించపరచడం తన ఉద్దేశం కాదని, వారిని నియమించుకునే కంపె నీలు, వీసా వ్యవస్థను విమర్శించడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. అమెరికన్ ఉద్యో గుల ప్రయోజనాలను కాపాడుతూనే.. దేశానికి సేవ చేయాలనుకునే విదేశీ నిపుణులకు గౌర వంగా స్వాగతం పలకాల్సిన అవసరం ఉందన్నారు. "విదేశీ ఒప్పంద పనివాళ్లు అంటూ ఆ రోజు నేడు వాడిన పదం సరైనది కాదు. హెచ్1బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలన్నది నా ఉద్దేశం కాదు. నా కుటుంబం ఎక్కడి నుంచి వచ్చిందో మీకు తెలిసే ఉంటుంది. దక్షిణ భారత్ నుంచి వలస వచ్చిన నా అత్త, మామలను నేను ఎంతో ప్రేమిస్తాను. అమెరికాలోనే జన్మించిన వారి కుమార్తె ఇప్పుడు ద్వితీయ మహిళ(వాన్స్ భార్య ఉష)గా ఉన్నారు. ఆమెను చూసి ఎంతో గర్విస్తున్నాను. ఆమెను ఎంతగానో ప్రేమిస్తున్నాను అని సీబీఎస్ న్యూస్ టౌన్ హాల్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వాన్స్ చెప్పారు. 'పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం' (పెర్మ్)ను భారత ఐటీ కంపెనీలు వినియోగించుకోకుండా ఈ నెల మొదట్లో నిషేధం విధించిన సందర్భంగా జేడీ వాన్స్ మాట్లాడుతూ.. పలు వ్యాఖ్యలు చేశారు. భారత్కు చెందిన ఐటీ కంపెనీలు హెచ్1బీ వీసాను దుర్వియోగం చేస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాన్స్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రాగా, భారత్ సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో వాన్స్ తన ఉద్దేశమేంటో వివరించే ప్రయత్నం చేశారు. ఓ పెద్ద కార్పొరేట్ సంస్థ తనవ ద్దనున్న ఉద్యోగులతో పనిచేయించుకోవడం సాధ్యం కాదని చెప్పి, విదేశీ అకౌంటెంట్ను నియ మించుకున్న అనంతరం.. అమెరికన్ అకౌంటెంట్ను తొలగిస్తే అది ఎలా సమర్థనీయం అవు తుందన్నారు. విదేశీ ఉద్యోగులను నియమించుకోవడాన్ని వ్యతిరేకించడం తన ఉద్దేశం కాదని స్పష్టం చేస్తూ.. అది అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఈ రెండింటి మధ్య సరైన సమతూకం అవసరమన్నారు.

# బాలీవుడ్ నటుడిపై దుండగుల కాల్పులు

**బాలీవుడ్ నటుడు ప్రయాణిస్తున్న కారుపై దుండగుల కాల్పులు**

**టైగర్ సురక్షితం, అతని డ్రైవర్, మరొకరికి గాయాలు**

**దాడి తమ పనేనని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటన**

**సల్మాన్ తో పనిచేసిన వాళ్లని వదలబోమని హెచ్చరిక**



**ముంబై :** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై హత్యాయత్నం జరిగింది. టైగర్ షాఫ్ ప్రయాణిస్తున్న కారుపై గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరిపారు. ముంబైలోని జుహు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దాడి నుంచి టైగర్ సురక్షితంగా బయటపడ్డారు. అయితే, టైగర్ షాప్ కారు డ్రైవర్, మరో ఆటో డ్రైవర్ గాయ గాయపడ్డారు. అయితే, ప్రాఫ్పై దాడి తమ పనేనని బిష్టోయ్ గ్యాంగ్ ప్రకటిం చడం తీవ్ర కలకలం రేపింది. ఈ దాడికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరలవ్వగా వివరాలిలా ఉన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు జాకీ షాప్ కుమారుడు, యాక్షన్ హీరోగా పేరొందిన టైగర్ ప్రాఫ్.. జుహు పోలీసుస్టేషన్ పరిధి లోని పుష్పా పార్కులో ఆదివారం సాయంత్రం ఫుట్బాల్ ఆడాడు. అనంతరం తన స్నేహితునితో కలిసి కారులో తిరుగు ప్రయాణమైన ప్రాప్ను చూసేందుకు ఆ పార్కు ద్వారం వద్ద పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. జనం మధ్యలో నుంచి కారు నెమ్మదిగా కదులుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ప్రాప్ లక్ష్యంగా కారుపై నాలుగైదు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆపై ఓ ద్విచక్రవాహనంపై ముగ్గురు పరారయ్యారు. ఈ దాడిలో టైగర్ ప్రాప్కు ఎలాంటి గాయాలవ్వలేదు కానీ ఆయన కారు డ్రైవర్తో పాటు రోడ్డుపై ఉన్న ఓ ఆటో డ్రైవర్ గాయపడ్డారు. దాడి అనంతరం టైగర్ ష్రఫ్ డ్రైవింగ్ సీటులోకి మారి అదే కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. టైగర్ షాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన తండ్రి జాకీ షాప్ కూడా ప్రకటించారు. కాగా దాడి విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కాల్పులకు పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు చర్యలు ప్రారంభిం చారు. మరోపక్క, టైగర్పై దాడి తమ పనేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సల్మాన్ ఖాన్తో పని చేసిన ఏ ఒక్కరిని విడిచిపెట్టమని, ఏదో ఒక రోజు ప్రతిఒ క్కరి వంతు వస్తుందనే అర్థంతో బిష్ణోయ్ ముఠాకి చెందిన అనిల్ పండిట్ ఓ పోస్టు చేశాడు. అయితే, దాడికి పాల్పడింది ఎవరు ? అనే దానిపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.

# 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్

### 'పీపుల్ అగైనెస్ట్ సర్' కూటమి పిలుపు

**న్యూఢిల్లీ :** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అక్టోబర్ 23న ప్రజామార్చ్ నిర్వహించనున్నట్టు 'పీపుల్ అగైనెస్ట్ సర్' కూటమి ఆదివారం ప్రకటించింది. సర్‌ను రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను పునరుద్ధరించడం తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. ప్రతి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో రైతులు, యువకులు, ప్రజాసంఘాల లీడర్లు, మేధావులు, కార్మిక సంఘా లు, విద్యార్థులు జెండాలు పట్టుకుని నిరసనల్లో పాల్గొనాలని కూటమి కోరింది. హర్ హాత్ మే తిరంగా, హర్ గలీ జంతర్‌మంతర్ నినాదాలతో మార్చ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్, కిసాన్ సభ నాయకుడు కృష్ణ ప్రసాద్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు సాయిబాలాజీ ఉన్నారు.

# ఈదురు గాలులు.. భారీ వర్షం

## భువనగిరి జిల్లాలో నేలకొరిగిన వరి

## జలాల్‌పూర్‌లో 6.9 సెం.మీ వర్షపాతం నమోదు

**భూదాన్‌పోచంపల్లి :** ఎల్‌నినో ప్రభావంతో ఎండలు మండుతున్న వేళ కురిసిన భారీ వర్షంతో ప్రజలకు ఊరట లభించింది. కానీ, ఈదురు గాలుల ప్రభావంతో యాదాద్రి–భువనగిరి జిల్లాలో భారీ వర్షానికి వరి పైరు నేలకొరిగింది. అత్యధికంగా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూ–ర్‌లో 6.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో 6.3 సెం.మీ, బీబీనగర్ మండలం వెంకిర్యాలలో 3.2 సెం.మీ, మోత్కూరులో 4 మి.మీ, బీబీనగర్‌లో 1.5 మి.మీ వర్షం కురిసింది. భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లి, పెద్దగూడెం ముక్తాపూర్, జూలూరు, కాప్రయిపల్లి, రేవణపల్లి గౌసుకొండ తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి కోత దశకు వచ్చిన వరి నేలకొరిగింది. మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షంతో చేకూరి వెంకన్న అనే రైతుకు చెందిన 8.5 ఎకరాల వరిపొలం నేలకొరిగింది. తేలికపాటి వర్షమే కురిసినా గాలి వీయడంతో పంట నేలకొరిగి నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

# విజయదశమికి సొంతూళ్లకు బయలుదేరిన హైదరాబాదీలు

## ప్రయాణికులతో బస్టాండ్‌లు, వాహనాలతో హైవేలు కిటకిట



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం హైదరాబాద్ వచ్చిన వారిలో చాలా మంది దసరా పండగకి సొంతూళ్లకు బయలుదేరారు. పాఠశాలలకు సెలవు దినాలు మొదలైనప్పటి నుంచి పెరిగిన పండగ ప్రయాణాలు.. శనివారం నుంచి మరింత ఊపందుకున్నాయి. రాష్ట్రంలోని స్వగ్రామాలకు వెళ్లేవారితోపాటు ఏపీలోని సొంతూళ్లకు వెళ్లేవారితో బస్టాండ్‌లు, కార్లు, బస్సులతో జాతీయ రహదారులు ఆదివారం కిటకిటలాడాయి. ముఖ్యంగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఆదివారం చాలా రద్దీగా మారింది. సాధారణ రోజుల్లో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ నుంచి 38 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఆదివారం ఈ సంఖ్య 51 వేలు దాటింది. దీంతో చౌటుప్పల్‌లోనూ వాహన రద్దీ కనిపించింది. చౌటుప్పల్ మీదుగా విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కార్ల దారి మళ్లింపు కొనసాగుతోంది. మరోపక్క, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్– భూపాలపల్లి 163వ జాతీయ రహదారి కూడా ఆదివారం కిటకిటలాడింది. వరంగల్ హైవేపై వాహనాల రద్దీ పెరగ్గా... బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరి కనిపించాయి. కాగా, పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు ఆదివారం కిక్కిరిశాయి. రద్దీకి తగినట్లు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూశారు. హైదరాబాద్ నుంచి వెయ్యికి పైగా సిటీ బస్సులను జిల్లాలకు పంపించారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు రెగ్యులర్ సర్వీసులతో పాటు వెయ్యికి పైగా ప్రత్యేక సర్వీసులను ఏపీ, తెలంగాణ జిల్లాలకు నడిపినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. అయితే, గ్రామీణ ప్రాంతాల సర్వీసులను ప్రత్యేక బస్సులుగా నగరాలు, ప్రధాన మార్గాలకే పరిమితం చేయడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు లేకుండా పోతున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ వంటి పట్టణాల బస్టాండ్‌ల నుంచి పల్లెలకు వెళ్లే బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

# స్కూటీని ఢీకొన్న కారు.. అక్కాతమ్ముళ్ల మృతి

## బాలికకు తీవ్ర గాయాలు.. పండగకు పుట్టింటికి

## వస్తుండగా హయత్‌నగర్ వద్ద ప్రమాదం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** బతుకమ్మ పండగ పూట హైదరాబాద్ శివారులోని పెద్దఅంబర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. మూడేళ్ల కూతురుతో కలిసి పండగకు పుట్టింటికి బయలుదేరిన ఓ మహిళను, తన చిన్నమ్మ కొడుకును కారు రూపంలో మృత్యువు కబలించింది. స్కూటీపై వెళుతున్న వారిని ఓ కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కాతమ్ముళ్లు ఇద్దరు అక్కడిక్కడే మృతిచెందారు. బాలికకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. హయత్‌నగర్ బస్టాండ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. శంషాబాద్ మండలం సుల్తాన్‌పేట్‌కు చెందిన రేఖ (34) తన మూడేళ్ల కూతురు చార్వికతో కలిసి పెద్దఅంబర్‌పేట్‌లోని తన పుట్టింటికి ఆదివారం ఉదయం బయలుదేరింది. బస్సులో ఎల్‌బీనగర్‌కు చేరుకున్న ఆమె.. అక్కడ తన చిన్నమ్మ కొడుకు ఏదుల నవీన్ (25) స్కూటీ ఎక్కింది. హయత్‌నగర్ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ జాం కావడంతో నవీన్ స్కూటీని ఓ డీసీఎం వ్యాను వెనుక నిలిపాడు. అదే సమయంలో అతి వేగంగా వచ్చిన ఓ మహీంద్రా కారు.. స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో రెండు వాహనాల మధ్య నలిగిపోయి రేఖ, నవీన్ అక్కడిక్కడే మృతి చెందారు. బాలికకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీకి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి వస్తారనుకునేలోపే ఆ దేవుడు తన కుమార్తెను, చెల్లెలు కొడుకును దూరం చేశాడంటూ పోలీస్‌స్టేషన్ వద్ద మృతురాలి తల్లి సువర్ణ రోదనలు అందరినీ కలిచివేశాయి. రేఖ తండ్రి జంగయ్య ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

## భద్రాచల రామమందిర అభివృద్ధికి రూ.276 కోట్లు

## బాసర ఆలయానికి రూ.354 కోట్లు

## విద్యార్థుల భవిష్యత్తే.. మన రాష్ట్ర భవిష్యత్తు

## అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

## సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**ప్రజా దీవెన, ఖమ్మం :** రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన, ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.44 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామదాసు నాయక్ పట్టు దలతో ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ. 2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు, అక్కడి అలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు. సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా ప్రజల అవసరాలను తీర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని, అందుకే రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా. 50 లక్షలకులు ఒబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణలో పుట్టిన ప్రతి కుటుంబానికి ధీమానిచ్చేలా ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించబోతున్నా మని డిప్యూటీ సీఎం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 10 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రతి నియోజక వర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నా మని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటరు కూడా కేటాయించామన్నారు.

### రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంపై సుమారు రూ.8.20 లక్షల కోట్ల అప్పుల భార పడిందని, ప్రస్తుతం అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

### నీటిని పొదుపుగా వినియోగించాలి.

ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాగునీటితోపాటు పశువులు, పక్షుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. భూగర్భజలాల పరిస్థితిని గమనించి మోటార్లను వినియోగించాలని రైతులను కోరారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో కళా బృందాలు, అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. శాస్త్రవేత్తలు. వ్యవసాయ నిపుణుల సూచనలతో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని పేర్కొన్నారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రహదారులను మంజూరు చేశామని టీ భట్టి విక్రమార్క తెలిపారు. నాచారం గ్రామం నుంచి జూలూరుపాడు మీదుగా, తల్లాడ–భద్రాచలం ప్రధాన రహదారిని కలిపేలా గన్నవరం, నాచారం, భద్రతండా ప్రాంతాలకు ఉపయోగపడే మరో బీటీ రహదారిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అధ్యక్షత వహించగా స్వయం సహాయక సంఘాలకు రూ.3.38 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణ చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు. ఈ కార్య క్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్త్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వ రావు డిసిసి అధ్యక్షులు సూతి సత్యనారాయణ కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, సిర సురేందర్, ఎస్‌ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బిఎస్‌ఈ యుగంధర్రావు, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అజ్మీరా సురేష్ పాల్గొన్నారు.

# అది రేవంత్ జాబ్ 'రాకెట్'

## జర్మనీలో ఉద్యోగాలని నిరుద్యోగులకు ఆశలు

## ఒకొకరి నుంచి రూ.4.5 లక్షల వసూలు

## రెండేండ్లు గడిచినా ఇంకా దక్కని కొలువులు

## వసూలు చేసిన ప్రతి పైసా తిరిగి ఇవ్వాలి

## శ్వేతపత్రం ఇవ్వాలి : హరీశ్‌రావు డిమాండ్



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** జర్మనీ ఉద్యోగాల పేరిట రేవంత్ ప్రభుత్వం తెలంగాణ నిరుద్యోగులను దారుణంగా మోసగించిందని, ప్రభుత్వరంగ సంస్థ టామ్‌కామ్‌ను తన దోపిడీకి రాకెట్‌గా మార్చేసిందని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలోని 15 జిల్లాలకు చెందిన 70 నుంచి 75 మంది యువకుల నుంచి ఉద్యోగాలతో పాటు పరీక్షలు, బీమా, వీసా ఖర్చులు కలిపి ఒకొకరి నుంచి రూ.4.5 లక్షల చొప్పున వసూలు చేసినట్టు ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రెండేండ్లు గడిచినా నిరుద్యోగ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించలేదని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై తాజాగా మీడియా ముందుకొచ్చిన 24 మంది అభ్యర్థుల్లో ఒకరికి కూడా కనీసం ఏ ఒక జర్మన్ దేశ సంస్థ కూడా ఇంటర్వ్యూలు నిర్వహించలేదని తెలిపారు. ఈ విషయంలో నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నమ్మించి గొంతుకోసిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి పేద కుటుంబాలు తెచ్చిన అప్పులకు నేటికీ వడ్డీలు చెల్లిస్తూ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మొదట జర్మన్ భాష బీ–1 లెవెల్ పూర్తి చేయాలని చెప్పిన అధికారులు, తీరా అది ఉత్తీర్ణత సాధించాక బీ–2 పరీక్ష కూడా రాయాలంటూ నిబంధనలు మార్చి కాలయాపన చేశారని దుయ్యబట్టారు. మరోవైపు, 9 మంది యువకులు 'జర్మనీ వెళ్లడానికి సర్వం సిద్ధం' అంటూ స్వయంగా ప్రభుత్వ ప్రచారం ప్రకటనలు వెలువరించినా, వాస్తవానికి వారిలో ఒకరిని కూడా ఇప్పటికీ విదేశాలకు పంపలేదని చెప్పారు.

### మళ్లీ కొత్త బ్యాచ్ ప్రారంభం

బాధిత 70 కుటుంబాలు రెండేండ్లుగా దికుతోచని స్థితిలో న్యాయంకోసం వేచి చూస్తున్నారని, వారి సమస్యలను గాలికొదిలి గత జూన్ నెలలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మళ్లీ విదేశీ ఉద్యోగాల పేరిట కొత్త బ్యాచ్‌ను ప్రారంభించి అబద్ధపు హామీలు ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన వివాదం వస్తే బాధితులు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టు పరిధిలోనే తేల్చుకోవాలంటూ అగ్రిమెంట్లపై బలవంతంగా సంతకాలు చేయించుకోవడం పెద్ద కుట్ర దాగి ఉన్నదని చెప్పారు.

### నిరుద్యోగుల పక్షాన పోరాటం

జర్మనీ ఉద్యోగాల పేరిట జరిగిన భారీ కుంభకోణంపై బాధిత నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని హరీశ్‌రావు స్పష్టంచేశారు. టామ్‌కామ్, ఫెయిర్‌ట్రేడ్ ఇండియా సంస్థలు నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన ప్రతి పైసానూ వెంటనే వెనకి చెల్లించాలని, గడిచిన రెండేండ్ల సమయం, వడ్డీల భారం, మానసిక వేదనను పరిగణనలోకి తీసుకుని బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని, బాధితులందరికీ ప్రభుత్వమే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, దీనిపై వెంటనే సీఐడీ లేదా న్యాయ విచారణ జరిపించి దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన ఫీజులు చెల్లించాలని, విదేశీ ఉద్యోగ నియామకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఏడు వర్సిటీల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

## భర్తీ చేయాలని విద్యామండలికి సర్కారు ఆదేశం

## తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారిగా

## వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో ఈ పోస్టుల భర్తీకోసం విద్యాశాఖ ఇటీవలే మార్గదర్శకాలు సిద్ధం చేసింది. వర్సిటీల వారీగా భర్తీ చేసే పోస్టుల వివరాలతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీపకుమార్ సుల్తానియా ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. భర్తీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, నియామకాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ ఉన్నత విద్యామండలికి సూచించారు. మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుండగా.. అందులో అత్యధికంగా ఉస్మానియా వర్సిటీ (ఓయూ)లో 252 పోస్టులు ఉన్నాయి. ఉస్మానియా క్యాంపసలోని 48 విభాగాలతోపాటు సిద్దిపేట, జోగిపేట, నర్సాపూర్‌లోని ఓయూ పీజీ కాలేజీల్లోనూ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇక కాకతీయ వర్సిటీలో 49, శాతవాహన 49, పాలమూరు 45, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 16, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలో 16, తెలంగాణ వర్సిటీల్లో 2 పోస్టులు భర్తీ చేయనున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలోని వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు జరుగుతుండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. చివరగా ఉమ్మడి రాష్ట్రంలో 2013లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు జరిగాయి. ఇక వర్సిటీల వారీగా కేటాయించిన పోస్టుల భర్తీకి ఉన్నత విద్యామండలి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, 1:10 నిష్పత్తిలో వడపోసి జాబితాను సంబంధిత వర్సిటీలకు పంపనుంది. వర్సిటీలు ఆ జాబితాలో నుంచి ఎంపిక చేసి తుది జాబితా ప్రకటిస్తాయి.

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో ఎంపిక జరుగుతుందని, నియామకాలన్నీ అత్యంత పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిస్టారెడ్డి తెలిపారు.



# అంజయ్య జీవితం స్ఫూర్తి దాయకం

**సామాన్య కార్మికుడి నుంచి సీఎం స్థాయికి ఎదిగిన నేత**

**ముఖ్యమంత్రిగా పని చేసినా అతి సామాన్య జీవితం**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సామాన్య కార్మికుడిగా జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మాజీ సీఎం టంగుటూరి అంజయ్య జీవితం నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయం అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మాజీ సీఎం, కేంద్ర మాజీ కార్మికశాఖ మంత్రి అంజయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని లుంబినీ పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి మహేశ్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిమిత విద్యాభ్యాసం చేసినా సామాన్యులు, కార్మికుల కష్టాలపై అంజయ్యకు లోతైన అవగాహన ఉండేదన్నారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, మంచి నేతగా గుర్తింపు పొందిన అంజయ్య.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనస్సును చూరగొన్న నాయకుడిగా నిలిచారన్నారు. కృషి, ఓర్పు, ప్రజల పట్ల నిబద్ధత, అంకిత భావంతో పని చేస్తే సామాన్య కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదగవచ్చునని అంజయ్య నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వి.హనుమంతరావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, అంజయ్య మనుమడు అభిషేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిర్వాకంతోనే కరువొచ్చింది

**మాకు పాలన అప్పగిస్తే నీళ్లు, కరెంట్ తెచ్చి చూపిస్తం**

**మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి**



**ప్రజా దీవెన, సూర్యాపేట :** నేటి కరువు ప్రకృతినుంచి వచ్చింది కాదని.. కేవలం కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం వల్లే వచ్చిన కరువు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఆయన సహచర మం త్రులు స్కామ్‌ల కోసం కరెంటును పోగొడుతున్నారని, గురువు కోసం నీళ్లను ఏపీకి ధారాదత్తం చేశారని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యుత్ విషయంలో నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రాష్ట్రం ఏర్పాటైతే ఈ ప్రాంతంలో విద్యుత్తు ప్రాజెక్టులు లేనందున తెలంగాణలో చీకట్లు అలుముకుంటాయని.. ఊర్ల జనం కూలికి పోయేందుకుకూడా పని దొరకదన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి సీఎం కేసీఆర్ ఆరు నెలలు తిరగకముందే దేశమే నివ్వెరపోయేలా, విదేశాల్లోని పెట్టుబడిదారులను ఆకట్టుకునేలా కరెంట్ వెలుగులు తెచ్చారని గుర్తుచేశారు. 24 గంటల కరెంట్‌తోపాటు 20 లక్షలకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు నిమిషం కూడా కరెంట్ పోకుండా ఇస్తే.. ఈ కాంగ్రెస్ కరెంట్ ఎందుకు ఇస్తలేదో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. ఇవ్వాళ వనరులు లేక కరెంటు పోతలేదని.. కేవలం స్కామ్‌లు చేసేందుకు కుట్రలకు దిగి కరెంటును ఇస్తలేరని దుయ్యబట్టారు. సింగరేణి ప్రభుత్వ సంస్థ అయినందున కమిషన్లు రావని.. దానిని పండబెట్టి ప్రైవేట్ బొగ్గు గనుల నుంచి బొగ్గు కొనుగోలు చేస్తే కమిషన్లు తెచ్చుకోవచ్చని సింగరేణిని పండబెట్టేందుకు దారులు వేశారని ఆరోపించారు. విద్యుత్ విషయంలో ఉద్యోగుల తప్పిదం లేకున్నా వారిని బలిచేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు చేతకాకుంటే బీఆర్‌ఎస్‌కు అధికారం అప్పగించాలని తెలిపారు. వెంటనే నీళ్లు, కరెంటు పునరుద్ధరణ చేసి చూపిస్తామని చెప్పారు. ఎల్ నినో సమస్య ఉన్నా కృష్ణమ్మ, గోదావరి నదుల్లో నీళ్లున్నాయని, వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పానికి మన నీళ్లను తరలించడం గురువుకు దక్షిణ కాదా? అని ప్రశ్నించారు.

# లోక్‌భవన్‌లో ఘనంగా దసరా వేడుకలు

**ఆయుధ పూజ నిర్వహించిన గవర్నర్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** విజయదశమి పర్వదినాన్ని పురసరించుకొని తెలంగాణ లోక్‌భవన్‌లో ఆదివారం దసరా సంబురాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా దుర్గాదేవితోపాటు పోచమ్మదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రతాసిబ్బందికి చెందిన ఆయుధాలు, అధికారిక వాహనాలకు ఆయుధ పూజ చేశారు. అనంతరం లోక్‌భవన్ అధికారులు, సిబ్బంది గవర్నర్‌ను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి వేడుకలను ప్రతి ఒకరూ సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గవర్నర్ సూచించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగలు రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని, సమాజంలో శాంతి, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# ఉక్రెయిన్ ఉగ్రరూపం

**ఉక్రెయిన్ దళాల భీకర యుద్ధం**

**అతిపెద్ద వైమానిక దాడి**

**ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు**

**ఇంధన వ్యవస్థలే టార్గెట్**

**మంటల్లో చమురు డిపోలు**

**డేటా సెంటర్లైనా దాడులు**

**1015 డ్రోన్లు కూల్చేశాం: మాస్కో**

**ప్రతీకార దాడులు జరిపిన రష్యా**

**ఉక్రెయిన్లోని జపోరిజియాపై ఎటాక్**

**మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు**



**కీవ్/మాస్కో:** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతోంది. రష్యాపై ఆదివారం ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టింది. ఒకేరోజు వెయ్యికిపైగా డ్రోన్లతో భీకర దాడులు జరిపింది. కీవ్ బలగాలు చేపట్టిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని రక్షణ వర్గాలు వెల్లడించాయి. రష్యాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని భారీ డ్రోన్ దాడులు నిర్వహించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. సెయింట్ పీటర్ బర్గ్ లోని చమురు ఎగుమతి టెర్మినల్, చమురు నిల్వ కేంద్రాలతో పాటు ఇతర పారిశ్రామిక, మౌలిక సదుపాయాలపై దాడులు జరిగినట్లు సమాచారం. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్పైనా దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఒకరు మరణించగా, మరో ఐదుగురు గాయపడినట్లు నివేదిక పేర్కొంది. రష్యా రక్షణ వ్యవ స్థలు వివిధ ప్రాంతాల్లో 1,015 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా అధికారులు ప్రకటించారు. కాగా, రష్యా కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఉక్రెయిన్లోని జపోరిజియాపై జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణా లు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు రష్యా క్షిపణి దాడులను ఎదుర్కొనేందుకు అమెరికా కీలక నిఘా సమాచా రాన్ని అందించడం తిరిగి ప్రారంభించిం దని ఉక్రె యిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు.

**అమెరికా-ఉక్రెయిన్ సంబంధాలపై ప్రభావం**

రష్యా చమురు కేంద్రాలపై ఉక్రెయిన్ జరుపుతున్న దాడులు, రష్యాపై ఆంక్షల విషయంలో అమెరికా అనుసరిస్తున్న విధానం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత లకు కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, ఉక్రెయిన్కు అందించే సైనిక, నిఘా సహకారంపై అనిశ్చితి నెలకొంది. మొత్తంగా, రష్యా చమురు, రవాణా, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై దాడులు, ఉక్రె యిన్పై రష్యా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో యుద్ధం మరింత సంక్లిష్టంగా మారుతోంది. అమెరికా నిఘా సహకారం పునరుద్ధరణ ఉక్రెయిన్ రక్షణకు ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు.

# ఓట్ చోరీకి మోడీ ప్లాన్

**అమిత్ షా అమలు ప్రణాళిక .. సీఈసీ ద్వారా కార్యరూపం**

**ఈ నేరానికి శిక్ష తప్పదు మూల్యం చెల్లించాల్సిందే : రాహుల్ గాంధీ ధ్వజం**

**మార్గోవా:** ఓట్ల చోరీకి పాల్పడుతున్న ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'గోయ్ రఖాన' (గోవాను కాపాడండి) యాత్ర ముగింపు కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మార్గావ్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి రాహుల్ గాంధీ సుమారు రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంత రం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ఓటు చోరీ జరుగుతోందని ప్రజలకు తెలుసని అన్నా రు. ఎన్నికల కమిషనర్ జానీ కుమార్ ఓటు చోరీకి సహర రిస్తున్నారని, ప్రధాని చెంది, అమిత్ షా ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారని రాహుల్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యా శీగాన్ని పరిరక్షించే శక్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా స్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఓట్ చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావు లేదు. మోడీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, వాటిని అమిత్ షా నిర్వహిస్తున్నారు. సీఈసీ వాటిని అమలు చేస్తున్నారు. ఈ ముగ్గురూ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని రక్షిం చే బాధ్యత కాంగ్రెస్ పై ఉంది. నాపై 45కు పైగా పరువునష్టం కేసులున్నాయి. వాటిలో మోడీ, అమితాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలుచేసినవే ఎక్కువ, అయితే ప్రధాని ఓట్ చోరికి పాల్పడ్డారనే నా ఆరోపణపై ఇప్పటి వరకు కేసు నమోదుకాలే దు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే వారు వెనకడుగు వేస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు. దేశంలో ఒకప్పుడు ప్రపంచస్థాయి విద్యావ్యవస్థ ఉండేదని పేర్కొన్న రాహుల్ గాంధీ. ప్రస్తుతం విద్యార్థుల నిరసనలపై పెల్లెట్ గన్లను ప్రయోగించే పరిస్థితు లు ఏర్పడ్డాయని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై కఠిన చర్యలకు దిగడం అందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు. గోవా భూములు, పర్యావరణం, సాంస్కృతిక వారస త్వం, ప్రత్యేక గుర్తింపును కాపాడటమే యాత్ర ప్రధాన లక్ష్య మని కాంగ్రెస్ పార్టీ తెలిసింది. భూముల వినియోగంలో మా ర్పులు, భూకబ్జాల ఆరోపణలు, నిరుద్యోగం, అవినీతి, ప్రజల భద్రత వంటి అంశాలను యాత్రలో పార్టీ ప్రస్తావించింది. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకోవడం తో పాటు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను రాజకీయ చర్చలోకి తీసుకురావడానికి ప్రయత్నించింది. సెప్టెంబర్ 22న ప్రారం భమైన 'గోయ్ రఖాన్స్' యాత్ర ఆదివారం ముగిసింది. మొ త్తం 27 రోజుల పాటు కొనసాగిన ఈ యాత్ర గోవాలోని 40 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసింది. ప్రతిపక్ష నేతయూ తి అలెమావో, గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిరీష్ చోడణ్కర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

**మెజార్టీ ఇవ్వండి: ఓటర్లకు రాహుల్ విజ్ఞప్తి**

2027 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్కు పూర్తి మెజారి టీ అందించాలని రాహుల్ గాంధీ ఓటర్లను కోరారు. రాష్ట్రవ్యా ప్తంగా ప్రజలను కలుస్తూ పార్టీ కార్యకర్తలు తమ ప్రచారాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఓటు చోరీ ఆరోపణలపై తనపై 45కు పైగా పరువు నష్టం కేసులు ఉన్నాయని, వాటిలో మోడీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసిన కేసులు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే, ప్రధాన మంత్రి ఓటు చోరికి పాల్పడారంటూ తాను చేసిన ఆరోపణపై ఇప్పటివరకు తనపై కేసు నమోదు కాలేదని పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్, హర్యానా, కర్ణాటక, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, అసోం రాష్ట్రాల్లో ఓటు చోరీ జరిగిందని తమ పార్టీ ఆధారాలతో నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లను చేర్చడం, ఓటర్లను ఒక జిల్లా నుంచిన రో జిల్లాకు మార్చడం, ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకు రావడం వంటి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. గోవా ప్రభుత్వం రైతులు, పేద ప్రజలకు చెందిన భూములను లాక్కో ని బయటి వ్యక్తులకు విక్రయిస్తోందని, ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు కారణంగా ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు అప్పగించే అవకాశం ఏర్పడిందని విమర్శించారు.

# నవరాత్రుల వేళ ఘోర విషాదం

**మధ్యప్రదేశ్లోని గ్వాలియర్లో ఘోర ప్రమాదం**

**నవరాత్రుల వేళ శీతలామాత ఆలయం వద్ద విషాదం**

**28 మందికి తీవ్ర గాయాలు.. విచారణకు ఆదేశించిన సీఎం**

**పోలీసు ఉన్నతాధికారిపై వేటు.. మరో 8 మంది సస్పెన్షన్**

**మృతుల కుటుంబాలకు 4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా**



**గ్వాలియర్/భోపాల్ :** నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వెళ్తున్న భక్తుల పాలిట ఓ లారీ మృత్యు శకటమైంది. ఆల యానికి వెళ్తున్న భక్తులపైకి దూసుకెళ్లడంతో 15 మంది దుర్మరణం చెందారు. ఇద్దరు పోలీసులు సహా 28 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘోర ప్రమాదం మధ్యప్రదేశ్లోని గ్వాలియర్ జిల్లాలో శీత లామాత ఆలయం వద్ద చోటుచేసుకుంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగింది.

**నో ఎంట్రీలోకి లారీ ఎలా వచ్చింది?**

గ్వాలియర్ నగరానికి 20 కి.మీ. దూరంలో శీతలా మాత ఆలయం ఉంది. నవరాత్రుల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తు న్నారు. ఈ క్రమంలో చినోర్ రోడ్డు వైపు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న (పంజాబ్ రిజిస్ట్రేషన్) లారీ దిగువకు వెళ్తూ ఒక్కసారిగా అదుపుతప్పింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తుల పైనుంచి దూసుకెళ్లింది. రహదారి పక్కన ఉన్న తాత్కాలిక దుకాణాలనూ ఢీకొట్టి, చివరకు ఆలయ ప్రవేశద్వా రాన్ని బలంగా తాకింది. ఈ ధాటికి ఆలయ ప్రహరీ గోడలో కొంత కూలినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఆలయానికి వెళ్లే మార్గంలో భారీ వాహనాలరాకపోకలపై ఆంక్షలు విధించారు. అయినప్పటికీ లారీ ఆ మార్గంలోకి ఎలా వచ్చింద న్నది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసు బారికేడ్లను దాటి వాహనం ముందుకు వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాద సమయంలో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల రోదనలతో ఆస్పత్రుల వద్ద హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. ట్రక్కు యజమాని, డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసు కున్నట్లు సమాచారం. కాగా, డ్రైవర్ గూగుల్ మ్యాప్ చూసి నిషేధిత మార్గంలోకి వచ్చి ఉ ంటాడని అధికా రులు భావిస్తున్నారు. ఆ క్రమంలోనే బ్రేకుల ఫెయిలై భక్తులపైకి లారీ దూసుకెళ్లి ఉంటుందని అనుమానిస్తున్నారు.

**సీఎం సీరియస్.. పోలీసులపై వేటు**

ప్రమాదంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణలు రావడంతో గ్వాలి యర్ సిటీ ఎస్పీని పదవి నుంచి తొలగించాలని ఆదే శించారు. మరో ఎనిమిది మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థి తులు, నిషేధిత మార్గంలోకి లారీ ప్రవేశించడంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రక టించారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్రేషియా ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# నల్గొండ జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

**నల్లగొండ జిల్లా కలెక్టర్ బి .చం ద్రశేఖర్**

**ప్రజా దీవెన, నల్లగొండ:** రాష్ట్ర ప్ర భుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.

ఆదివారం అయన ఎన్జీ కళాశాల మైదానంలో విద్య ,అటవీ, ఆర్ అండ్ బి,తదితర శాఖల ఆధ్వ ర్యంలో నిర్వహించిన సద్దుల బ తుకమ్మ ఉత్సవాలకు ముఖ్యఅ తిథిగా హాజరై బతుకమ్మలకు పూజలు నిర్వహించి బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ బతు కమ్మ ఉత్సవాలలో భాగంగా జి ల్లా కేంద్రంతో పాటు, అన్ని గ్రామా లు, మండలాలు, రెవెన్యూ డివి జన్లలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిం దని, బతుకమ్మ ఉత్సవాలు ప్రా రంభమైన మొదటి రోజు నుండి చివరి వరకు ప్రతిరోజు



నాలుగై దు జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎ న్జీ కళాశాల మైదానంలో ఉత్స వాలు నిర్వహించినట్లు తెలిపా రు. తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే బ తుకమ్మ ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించడమే కాకుండా ప్రజ లు స్వచ్ఛందంగా నిర్వహిం చు కోవడం సంతోషమని, అన్ని ము న్సిపాలిటీలలో కూడా ఈ సంవ త్సరం బతుకమ్మ ఉత్సవాలు వై భవంగా నిర్వహించారని తెలి పారు. చివరి రోజు సద్దుల బతు కమ్మ ఉత్సవాలలో సంబంధిత శాఖల అధికారు లు, సిబ్బంది పాల్గొని బతుకమ్మ ఉ త్సవాలను విజయ వంతం చేశారని అన్నారు. ఈ సం దర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్ర జలకు బతుకమ్మ శు భా కాం క్షలు తో పాటు, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డి ఇఓ సుశీంద్రరావు, ఆర్ అండ్ బి, అటవీ శాఖ అధికారులు, తదిత రులు ఉన్నారు.



# కండాంతరాలు దాటిన చెరగని తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు

**అమెరికాలోని శాన్ రామన్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కోదాడ ఎమ్మెల్యే**





**ప్రజా దీవెన, కోదాడ:** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం శాన్ రామన్ (San Ramon) నగరంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ వేడుకల్లో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతి సాంప్రదాయాలను తెలియజేశారుతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అమెరికా గడ్డపై తెలంగాణ ఆడపడుచులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఎక్కడ ఉన్నా మన సంస్కృతే మన గుర్తింపు... మన సంప్రదాయాలే మన ఆత్మగౌరవం!తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విదేశాల్లోనూ జరుపుకుంటూ మన సంస్కృతిని భావితరాలకు అందిస్తున్న తెలుగు ప్రజలకు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

# శాలిగౌరారంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**శాలిగౌరారం :** శాలిగౌరారం మండలం లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్గీయ నిమ్మల బిక్షమయ్య, శాలిగౌరారం సర్పంచ్ శేఖర్ బాబు సహకారం తో రామగిరి, శాలిలింగోటం, శాలిగౌరారం ఎస్ సి కాలనీ, బాలిశెట్టిగూడెం గ్రామాల్లో ఉత్తమ బతుకమ్మలు పేర్చిన మహిళలకు చీరలు అందజేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచులు శేఖర్ బాబు, చాడ చంద్రకళ, వంగూరు కవిత,క్లబ్ అధ్యక్షులు నిమ్మల ఆంజనేయులు, జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, డీసి మెంబర్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ కార్యదర్శి కప్పల శ్రీకాంత్,ప్రతినిధులు దామర్ల శ్రీనివాస్,వడ్లకొండ బిక్షం,రాపాక రాజు,చిర్రబోయిన శ్రీనివాస్ నిమ్మల వీరస్వామి,బండారు శంకర్,చిర్రబోయిన రమేష్,బట్ట చిన సైదులు తదితరులు పాల్గొన్నారు

# అన్నదానాలు పుణ్య కార్యాలు...

**దేవి నవరాత్రుల సందర్భంగా లిభవాని నగర్ లో మహా అన్నదానం**

**దుర్గాదేవి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి.**



**ప్రజా దీవెన, కోదాడ:** అన్నదానం మహా పుణ్యకార్యమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి ప్రతీక అని భవాని నగర్ దేవీ నవరాత్రుల ఉత్సవ కమిటీ పాలకవర్గం అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కోదాడ మున్సిపల్ పరిధిలోని భవానీ నగర్ 19వ వార్డులో శ్రీవర సిద్ధ వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత కళ్యాణ మండపం వద్ద అన్నదాతలు అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి దంపతులు అన్నపురెడ్డి అప్పిరెడ్డి దంపతులు అన్నపురెడ్డి వెంకటప్పయ్య రెడ్డి పొనుగండ్ల వీరారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ కొల్లా కోటిరెడ్డి వరసిద్ధి వినాయక దేవాలయ కమిటీ చైర్మన్ ముద్ర రామారావు దాతలతో కలిసి ప్రారంభించారు సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున అన్నదానం చేసిన దాతలను వారు అభినందించారు అభినందించారు. దేవీ నవరాత్రులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చింతనను బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ కమిటీ సభ్యులు నవరాత్రుల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ఊటుకూరులో శివాంజనేయ స్వామి దేవాలయలో అన్నదానం

**శాలిగౌరారం :** శాలిగౌరారం మండలం ఊటుకూరు గ్రామంలోని శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో కొలువైన దుర్గామాత 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వర్రె సైదులు – అనిత,యంపల్లి భీష్మారెడ్డి – శోభారాణి, వరికుప్పల సైదులు – జ్యోతి దంపతులు అన్నదాతలుగా వ్యవహారించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం శంకర్, ఉప సర్పంచ్ రంగు రాములు, కప్పల చంద్రశేఖర్, గుండ్ల శ్రీనివాసు, రంగు ముత్యం రాజు, భూపతి సత్యనారాయణ, బ్రహ్మాచారి, రంగు వీరయ్య, అయితగోని యాదగిరి, రంగు బిక్షం, బి. శ్రీనివాసు, కుర్ర గణేష్ , రంగు పూర్ణయ్య, ఉరుకుప్పల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీలే వెన్ను దన్ను

**గ్రామస్థాయి నుంచి ఆదివాసీ కమిటీల బలోపేతం**

**ఎమ్మెల్సీ, కాంగ్రెస్ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్**



**ప్రజా దీవెన, నల్లగొండ:** కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, పార్టీని క్షేత్ర స్థాయి నుంచి మరింత బలోపే తం చేసేందుకు గ్రామస్థాయి నుం చి రాష్ట్రస్థాయి వరకు ఆదివాసీ కమిటీలను ఏర్పాటు చేయను న్నట్లు ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రా ష్ట్ర ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ తెలిపారు. నల్ల గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాల యంలో ఆదివారం సంఘటన్ సృజన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆది వాసీ సమావేశానికి ఆయన ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బ లోపేతం, ఆదివాసీ నాయకత్వా నికి ప్రాధాన్యం, రాబోయే ఎన్నిక ల్లో అనుసరించాల్సిన కార్యాచర ణపై దిశానిర్దేశం చేశారు.

**33 జిల్లాల్లో కమిటీల ఏర్పాటు**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఆదివాసీ నాయకులు, మాజీ ప్ర జాప్రతినిధులను పంపించి 33 జి ల్లాల్లో జిల్లా కమిటీలను ఎంపిక చేయనున్నట్లు శంకర్ నాయక్ వె ల్లడించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి, కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు కృ షి చేస్తామని తెలిపారు. ఆదివా సీ నాయకుల భాగస్వామ్యంతో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి వి స్తృతంగా తీసుకెళ్తామని పేర్కొ న్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం**

రానున్న హైదరాబాద్ రంగారెడ్డి, ఖమ్మం--వరంగల్–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామ రామ్మోహన్ రెడ్డి, సర్వో త్తమ్ రెడ్డిల విజయానికి ఆదివా సీ నాయకులు, కార్యకర్తలు సమ ష్టిగా కృషి చేస్తారని స్పష్టం చేశా రు.

**75 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనే క అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లు చేపట్టిందని శంకర్ నాయక్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్ప డిన అనంతరం 75 వేల ఉద్యో గాలను భర్తీ చేసినట్లు పేర్కొ న్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సం క్షేమాన్ని లక్ష్యంగా పనిచేస్తుంటే, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నా యని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జ రగలేదని ఆరోపించారు. బీజేపీ మతాల పేరుతో రాజకీయాలు చేస్తోందని విమర్శిస్తూ, ఆ రెండు పార్టీల వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. కాం గ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అ భివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పి లుపునిచ్చారు.

**యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుపై వ్యాఖ్యలు**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ని ర్మాణ బడ్జెట్ తొలుత రూ.26 వే ల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం రూ.36 వేల కోట్లకు చేరిందని శంకర్ నాయక్ పేర్కొన్నా రు. అ యినప్పటికీ ప్రాజెక్టును పూర్తి చే సేందుకు ప్రభుత్వం అన్ని విధా లా కృషి చేస్తోందని తెలిపారు.

**ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డి తో ఆదివాసీ సమావేశం**

ఈ నెల 23న ముఖ్యమంత్రి రే వంత్ రెడ్డితో ఆదివాసీ నాయకు ల సమావేశం జరగనుందని శం కర్ నాయక్ వెల్లడించారు. ఈ స మావేశంలో ముఖ్యమంత్రి ఆది వాసీ నాయకులకు భవిష్యత్ కా ర్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.ఈ సమావేశంలో ఆది వాసీ వైస్ చైర్మన్లు లింగం నాయ క్, హనుమంతు నాయక్‌తో పా టు మోహన్, గణేష్, శ్రీనివాస్, చంద్రకళ, మల్లికార్జున్, మల్లీశ్వరి నాయక్, కోట్య నాయక్, తిరుమ ల నాయక్ తదితరులు పాల్గొ న్నారు.

# తుంగతుర్తి మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**ప్రజా దీవెన తుంగతుర్తి :** తుంగతుర్తి మండలంలోని వివిధ గ్రామాలలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు గత తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న బతుకమ్మ సద్దుల బతుకమ్మ రోజు చివరగా పూజలు అందుకుని ఘనంగా బతుకమ్మల నిమజ్జనం చేస్తారు ఈ సందర్భంగా గ్రామాలలో ఏ ఇంట చూసినా మహిళల సందడే కనిపించింది రంగురంగుల బతుకమ్మలతో ఆయా గ్రామాలలోని చెరువులు కుంటల వద్ద బతుకమ్మల నాడారు వివిధ రకాలైన ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు తూర్పు గూడెం గ్రామానికి చెందిన సూర్యాపేట జిల్లా మాజీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామానికి చెందిన మహిళలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో కలిసి బతుకమ్మలతో సందడి చేశారు. ఈ సందర్భంగా గుజ్జ దీపిక యుగంధర్ రావు మాట్లాడుతూ... తెలంగాణ ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. పూల బతుకమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు మహిళలంతా ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళలు ఐక్యతతో ఈ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గమ్మ తల్లికి బోనాలు...

**లిఅధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు..**



**కనగల్:** మండలంలోని కనగల్, బుడుమర్లపల్లి గ్రామాలలో శశిరన్నవరాత్రి మహోత్సవాలలో 8వ రోజు శ్రీ దుర్గా దేవి అవతారణంలో వెళ్తున్న దుర్గా దేవతకు గ్రామాలలో బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు గ్రామస్తులు దుర్గమ్మ తల్లికి బోనాలతో నైవిద్యాలు సమర్పించారు మహిళలు బోనపు బిందెలతో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధి దగ్గరికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటూ పాడిపంటలు బాగా పడాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో దుర్గాభవానులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వెళ్లి రావమ్మా బతుకమ్మ మళ్లీ రావమ్మా బతుకమ్మ

పూల పండుగకు
పోటెత్తిన మహిళా లోకం
కోదాడలో కన్నుల పండువగా
సద్దుల బతుకమ్మ సంబరాలు....
ఆటపాటలతో హోరెత్తిన బాలుర
ఉన్నత పాఠశాల ప్రాంగణం...
తెలంగాణఆడబిడ్డలఆత్మగౌరవానికి
ప్రతీక బతుకమ్మ.: కుసుమ



**ప్రజా దీవేన, కోదాడ:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు కోదాడ పట్టణంలో అంబరాన్నంటాయి. కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. తీరొక్క రంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన బతుకమ్మలను చేతబూని వందలాది మంది మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తరలివచ్చి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, లయబద్ధమైన అడుగులతో ఆటపాటలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటల సందడి, రంగురంగుల పూల సోయగాలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు, వైస్ చైర్‌పర్సన్ మల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని, తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను పూజిస్తూ, గౌరమ్మను కొలుస్తూ మహిళలు సామూహికంగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉందన్నారు. సద్దుల బతుకమ్మ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో బతుకమ్మను కొలిచి, చివరి రోజున సద్దుల బతుకమ్మతో వేడుకలను ఘనంగా ముగించడం తెలంగాణ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయమని వివరించారు. మహిళలు ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవడం సమాజంలో సాంస్కృతిక ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వందలాది మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేయగా, అందంగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతులు అందజేసి నిర్వాహకులు మహిళలను ప్రోత్సహించారు. పూల పండుగ వైభవాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలు పట్టణ ప్రజల్లో పండుగ ఉత్సాహాన్ని నింపాయి. మరోవైపు వేడుకల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో వేడుకలు ప్రశాంత వాతావరణంలో సాగాయి. మున్సిపల్ పాలకవర్గం సమన్వయంతో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు కోదాడలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమబాబు జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు మండల విద్యాధికారి సలీం షరీఫ్, వైస్ చైర్ పర్సన్ మల్లీశ్వరి మున్సిపల్ కమిషనర్ రమాదేవి వార్డు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు వేలాదిమంది మహిళలు పాల్గొన్నారు.





# మాజీ డీజీపీ భార్య తనూజ హత్య కేసులో కీలక పురోగతి

## ఆరు నెలల వేటకు తెర

## పోలీసుల అదుపులో నలుగు రు నేపాలీలు





**ప్రజా దీవెన, హైదరాబాద్:** మాజీ డీజీపీ భార్య తనూజ హత్య కే సులో తెలంగాణ పోలీసులకు కీ లక పురోగతి లభించింది. జూబ్లీ హిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో గత మే 8న జరిగిన ఈ హత్య కేసు లో నలుగురు నేపాలీలను పోలీ సులు అదుపులోకి తీసుకున్నా రు. వారిలో నేపాలీ పనిమనిషి కల్పనతో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు సమాచారం. తనూజను హత్య చేసిన అనంతరం బంగారు ఆభరణాలతో క ల్పన పరారైనట్లు పోలీసులు గు ర్తించారు. ఈ ఘటనపై కేసు న మోదు చేసిన పోలీసులు నింది తుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. దా దాపు ఆరు నెలల పాటు అన్వేష ణ కొనసాగించిన తెలంగాణ స్పె షల్ టీమ్స్ ఎట్టకేలకు నలుగురి ని అదుపులోకి తీసుకుని విచా రిస్తున్నాయి. ఈ హత్య వెనుక ఉన్న పూర్తి కా రణాలు, ఇతరుల ప్రమేయం, ఆ భరణాల ఆచూకీ వంటి అంశా లపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. పూర్తయిన తర్వాత కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



**ప్రజా దీవెన తుంగతుర్తి :** మండల పరిధిలోని కొత్తగూడెం టోల్ ప్లాజా వద్ద యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై ఆర్. క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన కంచం సందీప్ (28) అనే వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు సమాచారం అందింది. మృతుడు జాతీయ రహదారిపై కొత్తగూడెం గ్రామ సమీపంలోని టోల్ గేట్ వద్ద డబ్బా ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. మృతదేహానికి సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలు చేపట్టి, మృతికి గల కారణాలను నిర్ధారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. దర్యాప్తులో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు సేకరించడంతో పాటు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై నిర్ధారణ కాని వార్తలు, వదంతులను ప్రచారం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిసింది. నిందితులను త్వరలో పట్టుకుని చట్టరీత్యా శిక్షిస్తామని పోలీసులు తెలిపారు.

# ధ్యానం సాధకుల విజయానికి బలమైన పునాది

## ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు



**ప్రజా దీవెన, చిట్యాల:** ప్రతిరోజూ సుదర్శన క్రియ, యోగ, ధ్యానం సాధన చేయడం వల్ల ప్రతి ఒక్క రిలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆ త్మస్థైర్యం పెరిగి జీవితంలో విజ యాలను సాధించడానికి బల మైన పునాది ఏర్పడుతుందని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ నల్గొండ జిల్లా కోఆర్డినేటర్, టీచర్ పల్లపు బు ద్ధుడు అన్నారు. చిట్యాల మం డలం చిన్న కాపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవ రణలో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన హ్యాపీనెస్ కోర్స్ ముగింపు కార్యక్రమంలో ఆ దివారం ఆయన పాల్గొని విద్యా ర్థులకు షార్ట్ సుదర్శన క్రియ, యోగ, ధ్యాన సాధనలను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ యోగ సాధ కులలో శారీరక, మానసిక సామ ర్థ్యాలను పెంపొందించడంతో పాటు ఏకాగ్రత, సానుకూల ఆ లోచన, ఆత్మవిశ్వాసం పెరిగేలా యోగాసనాలు, సూర్యనమ స్కా రాలు, పద్మసాధన, త్రీ స్టేజ్ ప్రా ణాయామం, భస్త్రిక, ధ్యాన సాధ నలను బోధిస్తున్నట్లు తెలిపారు. ధ్యానం ప్రతి మనిషి జీవితంలో అంతర్భాగంగా ఉండాలని, ప్రతి రోజూ కనీసం పది నిమిషాలు ధ్యానం చేయడం ద్వారా మాన సిక ప్రశాంతత, ఒత్తిడి నియం త్రణ, సానుకూల శక్తి లభిస్తా య ని పేర్కొన్నారు. గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ సూచించిన సుదర్శన క్రియ ద్వారా ప్రతి వ్యక్తి తనలోని అంతర్గత శక్తిని గుర్తిం చి ప్రశాంతమైన, ఆనందమయ మైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. శాంతియుత సమాజ నిర్మాణానికి ధ్యానం, సేవాభా వం, మానవీయ విలువలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పి లుపునిచ్చారు. యోగా టీచర్ ప ల్లపు బుద్ధుడుని శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినం దించారు. గ్రామంలో యువత, విద్యార్థుల కోసం ఇలాంటి యోగ, ధ్యాన శిక్షణ కార్యక్రమా లను మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్, పల్లపు ప్రశాంత్, పొలిమేర దశరథ, శేఖర్, ఆవుల రమేష్, వలిగొండ సత్యనారాయణ, శిలివేరు పరమేష్ గురిజ శంకరయ్య, దయాకర్, ఈరమళ్ళ శ్రీను, ఈరమళ్ళ వెంకన్న, శ్రీను, మహేష్, నరసింహ, స్వామి మరియు భవాని మాల ధారణ స్వాములు యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు.



# ఘనంగా ముత్యంరాజు దంపతుల సిల్వర్ జూబ్లీ వివాహ వేడుక



**శాలిగౌరారం :** అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు ముత్యం రాజు – స్వాతి దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఊటుకూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు పులి రామకృష్ణ శర్మ వేద ఆశీర్వాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2001 అక్టోబర్ 18వ తేదీన జరిగిన వారి వివాహం నేటికి 25 సంవత్సరాలు పూర్తయ్యింది. దీంతో ఊటుకూరు గ్రామంలోని వారి స్వగృహంలో బంధు మిత్రుల సమక్షంలో వారి ఇద్దరు కుమార్తెలు సిల్వర్ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా పలువురు వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు గ్రామ సర్పంచ్ శీలం అనిత శంకర్, ఉప సర్పంచ్ రంగు రాములు గౌడ్, లయన్స్ క్లబ్ డిసి మెంబర్ బుడిగే శ్రీనివాసులు,ప్రెస్ క్లబ్ సభ్యులు వేముల పర్వతాలు, వాడపల్లి రాములు,బట్ట సైదులు,దేవాలయం కమిటీ సభ్యులు గుండ్ల శ్రీనివాస్, కె. బ్రహ్మాచారి, భూపతి సత్యనారాయణ, ఎ. యాదగిరి, రంగు వీరు, రంగు బిక్షం, పూర్ణయ్య, కుర్ర గణేష్, రంగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు వెలవెల నేడు అభివృద్ధిలో దూసుకుపోతున్న కోదాడ సంత

## సంత అభివృద్ధిలో మార్క్ చూపిస్తున్న మార్కెట్ చైర్పర్సన్

### దళారులకు అడ్డుకట్ట వేసుకుంటూ . సంత అభివృద్ధికి కృషి: వేపూరి తిరుపతమ్మ సుధీర్.

**ప్రజా దీవెన కోదాడ :** తాను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవి చేపట్టిన నాటినుండి సంత అభివృద్ధికి పాలకవర్గంతో కలిసి అభివృద్ధికి కృషి చేస్తున్నానని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ ఆదివారం విలేకరులకు తెలిపారు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డి కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో కోదాడ మార్కెట్ కమిటీని అభివృద్ధి దిశలో నడిపిస్తున్నానని తనకు వచ్చిన అవకాశాన్ని సక్రమంగా నిర్వహించాలని సంత లో ఎక్కడ అవినీతికి తావు లేకుండా నిజాయితీగా పని చేస్తున్నానని చైర్మన్ అన్నారు చేనీతి నిజాయితీగా పనిచేయాలని ఉద్దేశంతో కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి నిజమైన పార్టీ కార్యకర్తకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా చదువుకున్న మహిళకు అవకాశం ఇవ్వాలని ఉద్దేశంతో స్థానిక శాసనసభ్యులు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు నమ్మకాస్తులుగా కరుడుగట్టిన పార్టీ విధేయుడైన పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మండలంలో పార్టీని ముందుండి నడిపించిన వేపూరి తిరుపతమ్మ సుధీరులకు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించటం జరిగిందని అన్నారు మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలు. తనకచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని సంకల్పంతో సంత అభివృద్ధి కోసం ఎన్ని ఇబ్బందులు ఉన్నా సరే ముందు సంతలో ఉన్న లోటుపాట్లను తెలుసుకొని రైతులకు వ్యాపారస్తులకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తన వంతుగా సంత అభివృద్ధిని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నానని అన్నారు

గత 10 సంవత్సరాలకు ముందు పదవిలో కి రానప్పుడు దళారులు పిసి వసూలు అంటూ వ్యాపారస్తులను రైతుల దగ్గర బెదిరింపులు చేసి డబ్బులు వసూలు చేసేవారు సంత అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసి ఎక్కడ వేసిన గొంగడి లెక్క ఉన్న సంతను నేడు తాగునీటికి ఇబ్బంది లేకుండా పరిశుభ్రంగా ఉంచుతూ దందాలు లేకుండా బెదిరింపులు లేకుండా పిసి వసూలు లేకుండా చేసి నేరుగా రైతులకు వ్యాపారస్తులు సంతకు వచ్చి



కొనుగోలు అమ్మకాలు చేసే విధంగా వ్యాపారస్తులు రైతులను అడిగి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వయంగా వారితోనే పాలకవర్గ సభ్యులతో చర్చించి మంచి నిర్ణయాలు తీసుకుంటున్నానని అన్నాడు రహదారులకు చెస్ కట్టుకునే విషయం లో కఠినమైన నిర్ణయాలు తీసుకుంటూ రైతులతో వ్యాపారస్తులతో శభాష్ అనిపించుకుంటున్నారు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారస్తుల వాహనాలు కట్టే చేస్ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా స్వయంగా రాత్రి పగలు చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీ చేస్తూ సంత ఆదాయానికి గండి పడకుండా తన అభివృద్ధి మార్క్ చూపిస్తూ సింప్లిసిటీగా ఉంటూ ఎలాంటి ఆర్భాటాలు చేయకుండా సంత ఆదాయాన్ని పెంచడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు మహిళా చైర్మన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ పాలకవర్గ సభ్యులు సంబంధిత సిబ్బందితో సహకారంతో అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నానని పాలకవర్గం నియోజకవర్గ రైతులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.







# సద్దుల బతుకమ్మ సందడి దృశ్యాలు













## అరుదైన ప్రజానేత ఆర్ దామోదర్‌రెడ్డి

**ప్రజా దీవెన, హైదరాబాద్:** ప్రజాసేవనే అసలు రాజకీయ ధర్మమని, పదవి అనేది స్వలాభం కోసం కాదు, సమాజం కోసం వాడుకోవాల్సిన సాధనమని నిరూపించిన నేతలు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో ఒకరు దివంగత రామిరె డ్డి దామోదర్ రెడ్డి. నమ్మిన సిద్ధాంతం కొరకు, ఇచ్చిన మాట కొరకు ఎటువంటి స్థాయి కైనా వెళ్లేవాడు ఎంతటి కఠిన పరీక్షల కైనా నిలబడే వాడు.



శ్రీరామ్ సాగర్ జలాల సాధనలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో చిత్తశుద్ధితో వ్యవహరించారు. కాంగ్రెస్ ద్వారానే తెలంగాణ సాధ్యమవుతుందని బలంగా నమ్మిన నాయకుడు అయన.. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎటువంటి పైరవిలకు,ప్రలోభాలకు ఆస్కారం ఇవ్వలేదు. 2007లో ఐటీ, క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన చేసిన కృషి, ముఖ్యంగా హైదరాబాదును ఐటీ రంగంలో ముందుకు తీసుకువెళ్లే విధానాలు, గచ్చిబౌలి స్పోర్ట్స్ టవర్, మిలటరీ గేమ్స్ సందర్భంలో ఆయన కార్యక్రమాన్ని సమన్వయం చేసిన తీరు పాల్గొన్న క్రీడా అధికారులతో పాటు క్రీడాభిమానుల మెప్పు పొందింది. 2007లో యూసుఫ్ గూడా స్టేడియంలో జరిగిన ఇండియా పాకిస్తాన్ వాలీబాల్ ఫ్రెండ్లీ మ్యాచ్ కు నిర్వాహకులు ఎటువంటి ప్రైజ్ మనీ ప్రకటించకపోవడంతో ఆ మ్యాచ్ కు హాజరైన ఒక విలేకరి క్రీడామంత్రి దామోదర్ రెడ్డి గారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకురాగా, వెంటనే రెండు లక్షల నగదు పురస్కారాన్ని ప్రకటించి మ్యాచ్ అనంతరం అందజేసిన విషయము క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంది.

### సమగ్ర సమాచారంతో శాఖల సమీక్ష

ఆయన ఏ సమావేశానికి వెళ్లిన ముందుగానే దానిపై సమాస సమాచారం సేకరించి అధ్యయనం చేసి ఆ సమావేశ వాళ్లకు హాజరై తన పాత్ర ఎంతవరకు పరిమితమో అంతవరకు వ్యవహరించేవారు. విధుల పట్ల అలసత్వం అశ్రద్ధ చూపించే అధికారులను తల బిరుసుగా వ్యవహరించే ఉద్యోగులను తన దైన శైలిలో సుతిమెత్తగా హెచ్చరించేవారు. శాఖలపై సమగ్ర అజయ్నం చేసిన తర్వాత సమీక్ష సమావేశం నిర్వహించేవారు. ఒకసారి ఆయన ఆదేశాలు జారీ చేస్తే వెంటనే అమలు కావాల్సిందే!

### ప్రచారానికి దూరం

ప్రచార ఆర్భాటం ఆయనకు ఇష్టం లేదు. దృష్టి ఎల్లప్పుడూ పనిపైనే. అధికారులను ప్రోత్సహించి ఫలితాలు తీసుకురావడమే ఆయన శైలి. ఈ రోజుల్లో "ప్రజాసేవ కన్నా ప్రచారం" ప్రధానమైపోయిన రాజకీయాల్లో ఆయన శాంతమైన, పనిముఖ దృక్పథం అరుదైనది. ప్రజాజీవితంలో మరియు వ్యక్తిగత విషయాల్లో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా సరే ఎంతటి కోపం వచ్చే సందర్భం అయినా సరే ఆయన చిరునవ్వు వీడలేదు. తన అన్నదమ్ములు కుటుంబ సభ్యులు అంటే ఎంతో ప్రేమ చూపించే దామోదర్ రెడ్డి గారు ఏ రోజు కూడా వారిని ఆఫీస్ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అవకాశం ఇచ్చేవారు కాదు. ఆయనకు తన వ్యక్తిగత సిబ్బంది అంటే అమితమైన ప్రేమ. కష్టపడి పని చేసే వారిని బాగా ప్రోత్సహించేవారు.ఏదైనా సమస్య వచ్చిందంటే కచ్చితంగా ఆదుకునేవారు. వారి యొక్క ఆర్థిక అవసరాలను ఆయన వ్యక్తిగతంగా చూసుకునేవారు. నేటి రాజకీయాల్లో డబ్బు--మాయాజాలం ఆధిపత్యం పెరుగుతున్న సందర్భంలో, దామోదర్ రెడ్డి లాంటి నేతలు ఎందుకు అవసరమో మనకు గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. ఓటములు వచ్చినా పార్టీని విడవని, ప్రజల కోసం తన భూములను అమ్ముకున్న రాజకీయ నాయకుడు ఈ తరం ఎక్కడ? దామోదర్ రెడ్డి గారి మరణం కాంగ్రెస్‌కే కాదు, తెలంగాణ రాజకీయాలకు కూడా తీరని లోటు. ఆయనలాంటి నిజాయితీ గల నేతల జ్ఞాపకం కొత్త తరానికి రాజకీయాలు కేవలం అధికారం కోసం కాదని, అది ప్రజాసేవకు ఒక సాధనమని దామోదర్ రెడ్డి గారి జీవితం నుంచి నేర్చుకోవాలి.

**- ఎన్.వి. వి. గోపాల్ రావు**
**జాయింట్ సెక్రెటరీ, ఏపీ జెన్కో**

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ కార్యాలయంలో దుర్గాపూజ వేడుకలు



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** విద్యుత్ శాఖ ఏడిఈ ట్రాన్స్‌ఫా ర్మర్స్ కార్యాలయంలో దుర్గాపూ జ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్నినో ప్రభావంతో పెరుగుతున్న విద్యుత్ లోడ్‌ను సమర్థంగా నిర్వహిస్తూ, వినియోగదారులకు నిరంతరాయంగా మెరుగైన సేవలు అందిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది కృషిని కట్ట్కూరి శ్రీనివాస రెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, తక్షణమే పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ౨+ూాణజూ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది, డైరెక్టర్ నరసింహులు, చీఫ్ ఇంజినీర్లు బాలస్వామి, రవికుమార్, సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాసులు, డీఈ (వీడూ) ప్రభాకర్‌తో పాటు ఇతర అధికారులు అందిస్తున్న సహాయ సహకారాలకు కట్ట్కూరి శ్రీనివాస రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏఈలు శ్రీధర్ రెడ్డి, రాజు, స్వాతి, వారితో కలిసి పనిచేస్తున్న సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ విధి నిర్వహణకు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రశంసనీయమని అన్నారు.

### విద్యుత్ పొదుపుతో వ్యవస్థకు సహకరించాలి

విద్యుత్ వినియోగదారులు అవసరమైన మేరకే విద్యుత్‌ను వినియోగిస్తూ పొదుపు చర్యలు పాటించాలని కట్ట్కూరి శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎల్నినో ప్రభావంతో ఉత్పన్నమయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలు కూడా విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, శాంతి, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండో టీ20లో జింబాబ్వేపై భారత్ ఘనవిజయం

## షఫాలీ దంచేసింది

## 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ

## మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం




రాయ్‌పూర్: తొలి మ్యాచ్‌లో ఆశించిన రీతిలో ఆకట్టుకోని భారత మహిళల జట్టు ఈసారి కదం తొక్కింది. ముందుగా జింబాబ్వే బ్యాటర్లకు బౌలర్లు చుక్కలు చూపించగా.. అనంతరం ఓపెనర్లు షఫాలీ వర్మ (25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 55), కెప్టెన్ స్మృతి మంధాన (25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 నాటౌట్) తమ బ్యాటింగ్ స్థాయి ఏంటో చూపారు. దీంతో ఆదివారం జరిగిన రెండో టీ20లో భారత్ 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఈ ఫార్మాట్‌లో భారత్‌కిది వరుసగా పదో విజయం కావడం విశేషం. అలాగే 2-0తో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఆఖరి మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. ముందుగా జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్లకు 102 పరుగులు చేసింది. టిరిపానో (34), కెప్టెన్ నికోమో (27 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. నిక్కీ ప్రసాద్‌కు రెండు వికెట్లు లభించాయి. స్వల్ప ఛేదనలో భారత్ 8.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 104 పరుగులు చేసి గెలిచింది. బిజాకు ఓ వికెట్ దక్కింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా షఫాలీ నిలిచింది.

ఓపెనర్ల దూకుడు: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన భారత మహిళలు ఈసారి బ్యాటింగ్‌లో అదరగొట్టారు. ఓపెనర్లు షఫాలీ, మంధాన బ్యాట్లు ఝుళిపించడంతో జింబాబ్వే బౌలర్లు బెదిరి పోయారు. తొలి టీ20లో నాలుగు ఓవర్లలోనే 4 వికెట్లు తీసిన బౌలర్లకు ఈసారి ఓపెనింగ్ ద్వయం షాక్ ఇచ్చింది. ఇన్నింగ్స్ మొదటి బంతినే ఫోర్‌గా మలిచిన షఫాలీ మూడో బంతిని సిక్సర్ బాదడంతో పరుగుల వేట ఆరంభమైంది. అటు మంధాన ఐదో ఓవర్‌లో వరుసగా నాలుగు ఫోర్లు, షఫాలీ మరో ఫోర్‌తో 21 రన్స్ సమకూరాయి. తర్వాతి ఓవర్‌లో షఫాలీ 4,4,6 సాధించగా పవర్‌ప్లేలో జట్టు తమ రెండో అత్యధిక స్కోరు (76)ను సాధించింది. అదే ఊపులో ఓ సిక్సర్ ద్వారా 24 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన షఫాలీ ఆ వెంటనే బిజాకు చిక్కింది. దీంతో తొలి వికెట్‌కు 96 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి విజయానికి 7 పరుగుల దూరంలో నిలిచిన భారత్.. మంధాన సిక్సర్‌తో 67 బంతులుండగానే లాంఛనాన్ని ముగించింది.

బౌలర్ల హవా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. 30/3 స్కోరుతో కష్టాల్లో పడగా టిరిపానో, నికోమో నాలుగో వికెట్‌కు 45 రన్స్ జోడించారు. అయితే తొలిసారి బౌలింగ్‌కు దిగిన నిక్కీ తొలి రెండు బంతులకు రెండు వికెట్లు తీయడం ఈ మ్యాచ్‌లో విశేషం.

### స్కోరుబోర్డు

జింబాబ్వే: ఎన్‌ధ్లోవు (బి) నందని 0, బిజా (సి) హర్మన్ (బి) దీప్తి 7, టిరిపానో (సి) రిచా (బి) నిక్కీ 34, మేయర్స్ (సి) దీప్తి (బి) క్రాంతి 9, ఎన్‌కోమో (నాటౌట్) 27, గ్వాంజుర (ఎల్బీ) నిక్కీ 0, ముపచిక్వ (రనౌట్) 9, మవుంగ (సి) నిక్కీ (బి) శ్రీచరణి 4, చిపరె (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 102/8. వికెట్ల పతనం: 1-10, 2-20, 3-30, 4-75, 5-75, 6-94, 7-99, 8-102. బౌలింగ్: క్రాంతి 4-0-15-1, నందని 3-0-17-1, దీప్తి 3-0-13-1, అరుంధతి 3-0-17-0, శ్రీచరణి 4-0-21-1, షఫాలీ 1-0-7-0, నిక్కీ 2-0-7-2.

భారత్: షఫాలీ (సి) మకుష (బి) బిజా 55, మంధాన (నాటౌట్) 47, అనుష్క (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 8.5 ఓవర్లలో 104/1. వికెట్ల పతనం: 1-96; బౌలింగ్: గ్వాంజుర 3-0-42-0, మకుష 2-0-19-0, మవుంగ 1-0-15-0, చారె 1.5-0-19-0, బిజా 1-0-9-1.

## అంతర్జాతీయ క్రికెట్‌లో బాబర్ అజామ్ సరికొత్త మైలురాయి

పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ తన కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 16,000 పరుగులు పూర్తి చేసిన ఐదో పాకిస్థాన్ క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఆదివారం రావల్పిండి వేదికగా శ్రీలంకతో జరిగిన వన్డే ట్రై-సిరీస్ మ్యాచ్‌లో బాబర్ ఈ ఘనత సాధించాడు. ఈ మైలురాయిని బాబర్ కేవలం 399 ఇన్నింగ్స్‌లలోనే చేరుకోవడం విశేషం. దీని ద్వారా పాకిస్థాన్ తరఫున అత్యంత వేగంగా 16,000 పరుగులు పూర్తి చేసిన మూడో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. అతని కంటే ముందు మహమ్మద్ యూసుఫ్ (388 ఇన్నింగ్స్‌లు), జావెద్ మియాందాద్ (398 ఇన్నింగ్స్‌లు) మాత్రమే ఉన్నారు. ఓవరాల్ గా పాకిస్థాన్ తరఫున ఇంజమామ్-ఉల్-హక్, యూనిస్ ఖాన్, జావెద్ మియాందాద్, మహమ్మద్ యూసుఫ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు బాబర్ అజామ్ వారి సరసన చేరాడు. శ్రీలంకతో మ్యాచ్ ప్రారంభానికి ముందు బాబర్ ఈ రికార్డుకు కేవలం 7 పరుగుల దూరంలో ఉన్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్‌కు మూడో ఓవర్లో ఓపెనర్ సైమ్ అయూబ్ ఔటవ్వడంతో బాబర్ క్రీజులోకి వచ్చాడు. తనదైన శైలిలో చూడచక్కని డ్రైవ్‌లతో పరుగులు రాబట్టి వేగంగా ఈ మైలురాయిని దాటాడు. ఈ మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన బాబర్, 57 బంతుల్లో 6 ఫోర్లతో 45 పరుగులు చేసి ఎషాన్ మలింగ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ప్రస్తుతం పాకిస్థాన్ గడ్డపై శ్రీలంక, ఇంగ్లండ్ జట్లతో వన్డే ట్రై-సిరీస్ జరుగుతోంది. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ సిరీస్‌లో అక్టోబర్ 31న లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## ఒక్క పరుగుకే గిల్ ను వెనక్కిపంపిన ఛత్తీస్‌గఢ్ బౌలర్



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రంజీ ట్రోఫీ రీఎంట్రీ కలిసిరాలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతను, ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. పంజాబ్ తరఫున ఆడుతున్న గిల్, కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఛత్తీస్‌గఢ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ అద్భుతమైన బంతితో అతడిని క్లీన్ బౌల్డ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మొహాలీలోని కొత్త పీసీఏ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టులో గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇన్నింగ్స్ 27వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన అజయ్ మండల్.. తన మూడో బంతికే గిల్‌ను బోల్తా కొట్టించాడు. బంతి లైన్ ను అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైన గిల్, దాన్ని అడ్డుకోలేకపోయాడు. బంతి నేరుగా బ్యాట్, ప్యాడ్ మధ్యలో నుంచి దూసుకెళ్లి మిడిల్ స్టంప్‌ను గిరాటేసింది. దీంతో కేవలం 5 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగుకే గిల్ తన ఇన్నింగ్స్‌ను ముగించాడు. భారత జట్టు త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. ఈ కీలక పర్యటనకు ముందు రెడ్ బాల్ క్రికెట్‌లో తగినంత ప్రాక్టీస్ పొందాలనే ఉద్దేశంతోనే గిల్ ఈ రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు నిర్ణయించుకున్నాడు. సీజన్‌లోని తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్న అతను, ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చాడు. కానీ, ఊహించని విధంగా విఫలం కావడం అభిమానులను నిరాశపరిచింది. న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) ఫైనల్ రేసులో నిలవడానికి ఈ సిరీస్ భారత్‌కు చాలా కీలకం. అయితే, గిల్ తొలి మూడు వన్డేల్లో మాత్రమే ఆడి, టెస్ట్ సిరీస్‌కు సంసిద్ధం కావడానికి చివరి రెండు వన్డేలకు దూరం కానున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బెంగాల్ తరఫున సర్వీసెస్‌తో జరుగుతున్న మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో సోదరుడు మహమ్మద్ కైఫ్ జట్టులోకి వచ్చాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టులో చోటు కోల్పోయిన షమీ, న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక కాలేదు. అయితే, దేశవాళీ క్రికెట్‌లో మాత్రం అతను నిలకడగా రాణిస్తున్నాడు.

## అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం..

### పవర్‌లిఫ్టింగ్‌లో 3 స్వర్ణాలు!



ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు. ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు. గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్క్వాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం" అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.

## ఆ కారణంతోనే నా తాగుడు హద్దులు దాటింది

### చివరికి రిహాబిలిటేషన్ సెంటర్ వరకు తీసుకెళ్లింది: చాహల్



టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించాడు. భార్య, కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మతో విడాకుల తర్వాత తాను మద్యపానానికి బానిసయ్యానని, దాని నుంచి బయటపడేందుకు 26 రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స తీసుకున్నానని తెలిపాడు. ఈ కఠినమైన దశను అధిగమించి ఇప్పుడు మానసికంగా, శారీరకంగా ఎంతో మెరుగ్గా ఉన్నానని చాహల్ పేర్కొన్నాడు. భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాకు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో చాహల్ ఈ విషయాలను పంచుకున్నాడు. "2022 నుంచి మేమిద్దరం వేర్వేరుగా ఉన్నాం. 2025 మార్చిలో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నాం. ఆ తర్వాత, ముఖ్యంగా గత ఏడాది కౌంటీ క్రికెట్ ఆడిన తర్వాత నా మద్యపానం హద్దులు దాటింది. అందుకే రిహాబ్ సెంటర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. అక్కడ 26 రోజులు ఉన్నాను. ఇప్పుడు దానిని ఎలా నియంత్రణలో ఉంచుకోవాలో నాకు తెలుసు" అని చాహల్ వివరించాడు. రిహాబ్‌లో ఉండటం వల్ల తనలో భావోద్వేగ సమతుల్యత, పరిణతి పెరిగాయని చాహల్ తెలిపాడు. శారీరకంగానూ ఎంతో ఫిట్‌గా మారానని, గత ఐపీఎల్ సీజన్‌లో తాను మళ్లీ 30 ఏళ్ల వాడిలా చురుగ్గా కదిలానని ఆనందం వ్యక్తం చేశాడు. 2011 ఐపీఎల్ ఆడే రోజుల్లో సరదాగా స్నేహితులతో కలిసి మద్యం తీసుకోవడం మొదలుపెట్టానని, అయితే విడాకుల తర్వాత అది వ్యసనంగా మారిందని అన్నాడు. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తల వల్ల తీవ్రమైన ఆందోళన, పానిక్ ఎటాక్స్ కూడా ఎదుర్కొన్నట్లు చాహల్ వెల్లడించాడు. తాను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే క్రికెట్ కెరీర్‌కు ఈ వ్యసనం వల్ల నష్టం జరుగుతుందని గ్రహించానని, అందుకే కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతుతో చికిత్స తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశాడు. అప్పట్లో తన సహచర ఆటగాడు ఏబీ డివిలియర్స్ జీవితంలో సమతుల్యత ఎంత ముఖ్యమో చెప్పిన మాటలను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నాడు.



## వైభవ్ విషయంలో గంభీర్.. ధోనీ విషయంలో గంగూలీ..

### యాజమాన్యంలో ఎంత తేడా!

టీమిండియా యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి నిరీక్షణ తప్పడం లేదు. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో జట్టుకు ఎంపికైనప్పటికీ, అతనికి ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. వైభవ్ మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రస్తుతం జట్టులో స్థిరపడిన ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లకే యాజమాన్యం ప్రాధాన్యత ఇచ్చింది. ఫామ్‌లో ఉన్నంత మాత్రాన తుది జట్టులో చోటు దక్కుతుందని భావించకూడదని, సీనియర్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం, భద్రతాభావం కల్పించడం ముఖ్యమని కోచ్ గంభీర్ గతంలోనే వైభవ్‌కు వివరించినట్లు తెలుస్తోంది. నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లకే తమ మొదటి ప్రాధాన్యత అని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ పరిణామం మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ నాయకత్వ శైలిని గుర్తుకు తెస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ విషయంలో గంగూలీ అనుసరించిన వైఖరికి, గంభీర్ వ్యూహానికి మధ్య ఉన్న తేడాపై విశ్లేషణలు మొదలయ్యాయి. ధోనీ తన అంతర్జాతీయ కెరీర్ ఆరంభంలో తొలి నాలుగు ఇన్నింగ్స్‌లలో విఫలమైనప్పటికీ, గంగూలీ అతనిపై నమ్మకం ఉంచి వరుస అవకాశాలు కల్పించాడు. ఆ నమ్మకాన్ని నిలబెడుతూ ధోనీ పాకిస్థాన్‌పై 148 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగి తన కెరీర్‌ను గొప్పగా మలుచుకున్నాడు. ఒక ఆటగాడిని ఎంపిక చేశాక, వారిపై ఒత్తిడి తగ్గించి సహజంగా రాణించేందుకు కనీసం పది మ్యాచ్‌లైనా అవకాశాలు ఇవ్వాలన్నది గంగూలీ సిద్ధాంతం. ప్రతిభావంతులైన యువకులకు అండగా నిలబడితేనే వారు భవిష్యత్ స్టార్లుగా ఎదుగుతారని దాదా బలంగా నమ్మేవాడు. ఇప్పుడు టీమిండియా తదుపరి న్యూజిలాండ్‌లో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లోనైనా వైభవ్ సూర్యవంశీకి యాజమాన్యం అవకాశం ఇస్తుందా? లేక గంభీర్ తన వ్యూహానికే కట్టుబడి ఉంటాడా? అనేది ఆసక్తికరంగా మారింది.

# సరైన టైమ్‌లో 'స్పిరిట్'.. నార్త్ బాక్సాఫీస్‌పై వంగా మాస్టర్ స్కెచ్!




'స్పిరిట్' అనుకున్నట్లుగానే పర్ఫెక్ట్ గానే సందీప్ రెడ్డి వంగా మొదటి నుంచి కాన్ఫిడెంట్ గానే చెబుతూ వచ్చారు. అయితే ఇప్పుడు మేకర్స్ సినిమా రేంజ్ కు తగ్గట్లుగా ఒక సాలిడ్ స్టెప్ తీసుకున్నారు. ప్రభాస్ పోలీస్ గెటప్‌ను థియేటర్లలో మరింత గ్రాండ్ గా ప్రెజెంట్ చేయడానికి ఏకంగా 2027 అక్టోబర్ 29న దీపావళి కానుకగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. మార్చి నుంచి దీపావళికి వెళ్లడం వెనుక ఒక పక్కా పాన్ ఇండియా స్కెచ్ కనిపిస్తోంది. కొత్త డేట్ తో పాటు వదిలిన పోస్టర్ కు ట్రెమెండస్ రెస్పాన్స్ వస్తోంది. 'వన్ బ్యాడ్ హ్యాబిట్' అంటూ ఇచ్చిన క్యాప్షన్, కూల్ గా క్యాప్ పెట్టుకున్న ప్రభాస్ స్టైలిష్ లుక్ సినిమాపై ఉన్న మోస్ట్ అవేటెడ్ బజ్ ను అమాంతం పెంచేశాయి. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కు ఫెస్టివల్ సీజన్ అయితేనే ఆ రేంజ్ ఓపెనింగ్స్ కు కరెక్ట్ గా సింక్ అవుతుందని మేకర్స్ ఈ పాజిటివ్ నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతోంది. షూటింగ్ పరంగా చూసుకుంటే స్పిరిట్ టీమ్ చాలా పక్కా ప్లానింగ్ తోనే ఉంది. జూలైలోనే 40 శాతం షూటింగ్ పూర్తయిందని, ఆగస్టులో మరో నలభై రోజుల షెడ్యూల్ జరిగిందని వంగా చెప్పారు. వర్క్ స్పీడ్ గానే జరుగుతున్నా, ఇంత భారీ సినిమాకు పోస్ట్ ప్రొడక్షన్, డబ్బింగ్ తో పాటు దేశవ్యాప్తంగా ప్రమోషన్ల కోసం ప్రత్యేకంగా సమయం కావాలి. అందుకే ఆ అదనపు సమయం తీసుకుని బెస్ట్ క్వాలిటీతో రావాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మార్చి 5 డేట్ ను స్కిప్ చేయడానికి టీ సిరీస్ ప్లానింగ్ కూడా ఒక రీజన్. అదే తేదీకి వాళ్ల సొంత సినిమా 'ఖోస్లా కా ఘోస్లా 2' కూడా ఉండటంతో.. ఒకే సంస్థ నుంచి రెండు విడుదలలు ఎందుకని స్పిరిట్ కు మరింత మంచి ఫెస్టివల్ స్లాట్ ను కేటాయించారు. ఈ నిర్ణయంతో బాక్సాఫీస్ దగ్గర సోలోగా వసూళ్ల సునామీ సృష్టించడానికి ఈ సినిమాకు ఫుల్ రన్ వే దొరికినట్లు అయింది. ముఖ్యంగా దీపావళి సెలవులు హిందీ మార్కెట్ కు అతిపెద్ద అడ్వాంటేజ్. నార్త్ లో బాక్సాఫీస్ కు అసలైన పండగ అదే. 'యానిమల్' సెన్సేషన్ తర్వాత వంగా డైరెక్ట్ చేస్తున్న సినిమా కావడంతో, దానికి ప్రభాస్ ఇమేజ్ తోడైతే దీపావళికి అక్కడ స్క్రీన్లు దద్దరిల్లడం ఖాయం. హిందీ మార్కెట్ లో రికార్డు ఓపెనింగ్స్ రాబట్టడానికి ఈ డేట్ ఒక బూస్ట్ లాంటిది. మొదటి నుంచీ భారీ అంచనాలున్న ఈ ప్రాజెక్ట్ లో తృప్తి దిమ్రి, వివేక్ ఒబెరాయ్ లాంటి సాలిడ్ క్యాస్టింగ్ ఉంది. రిలీజ్ కు అదనంగా దొరికిన ఈ టైమ్ ను టీమ్ మరింత పర్ఫెక్ట్ ఔట్ పుట్ ఇవ్వడానికి వాడుకోవడం గ్యారెంటీ. ప్రభాస్ ను థియేటర్లలో చూడటానికి ఫ్యాన్స్ కు కాస్త వెయిటింగ్ తప్పకపోయినా.. దీపావళికి వంగా ఇవ్వబోయే ట్రీట్ మాత్రం బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ తెస్తుందనడంలో డౌట్ లేదు.

# టాలీవుడ్‌లో జాన్వీ దూకుడు తగ్గినట్లేనా?

అతిలోక సుందరి శ్రీదేవి తనయగా ఇండియన్ సినిమాలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఓ రేంజ్‌లో హడావుడి చేసింది. సౌత్ ఇండియన్ ఆడియన్స్ ప్రత్యేకించి తెలుగు సినీ ప్రియులు శ్రీదేవిపై ఉన్న అభిమానంతో జాన్వీకి ఘన స్వాగతం పలికారు. అగ్ర హీరోల పక్కన గ్రాండ్ కాంబినేషన్లతో అడుగుపెట్టిన ఈ బాలీవుడ్ బ్యూటీ టాలీవుడ్ ని ఏలడం ఖాయమని భావించారు. కానీ ఆరంభంలో కనిపించిన అంచనాలు, ఊపు క్రమంగా తగ్గిపోతున్నాయా? తెలుగునాట జాన్వీ గ్రాఫ్ మెల్లగా పడిపోతోందా? అనే చర్చ ఫిలిం నగర్ వర్గాల్లో మొదలైంది. -ఆర్ఆర్ఆర్- లాంటి గ్లోబల్ హిట్ తర్వాత మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సరసన -దేవర- చిత్రంతో జాన్వీ కపూర్ టాలీవుడ్ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ ప్రాజెక్ట్‌లో జాన్వీ హీరోయిన్‌గా నటించడంతో ఆమెపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ప్రమోషన్లలో పాటల్లో జాన్వీ చూపించిన గ్లామర్, శ్రీదేవిని గుర్తుచేసేలా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. ఎన్టీఆర్ కాంబినేషన్ వల్ల సౌత్‌లో వరుసగా స్టార్ హీరోల పక్కన ఆఫర్లు వెల్లువెత్తుతాయని విశ్లేషకులు భావించారు. -దేవర- తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన -పెద్ది-లోనూ మెరిసింది. ఈ సినిమా బాగానే ఆడింది. ఇలా ఆరంభంలోనే ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి పాన్ ఇండియా స్టార్లతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఓకే చేసి సంచలనం సృష్టించిన ఆ తర్వాత కొత్తగా ఏ తెలుగు ప్రాజెక్ట్‌కి సంతకం చేయకపోవడం ఆమె దూకుడు తగ్గిందనడానికి సంకేతంగా కనిపిస్తోంది. టాలీవుడ్‌లోని ఇతర యంగ్ హీరోలు లేదా మీడియం రేంజ్ స్టార్ల సినిమాల్లో ఆమె నటించేందుకు మొగ్గు చూపకపోవడం.. మరోవైపు స్టార్ హీరోల సినిమాల్లో లేడీ ఓరియంటెడ్ లేదా ప్రాధాన్యత ఉన్న పాత్రలు లభించకపోవడం వల్ల జాన్వీ సైలెంట్ అయినట్లు తెలుస్తోంది.

అయితే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న -రాకా-లో నటిస్తోంది. కానీ అందులో హీరోయిన్ దీపిక నటిస్తుండగా...ఓ కీలక పాత్రలో మాత్రమే జాన్వీ మెరుపులు కనిపించనున్నాయి. దీంతో -రాకా- తో జాన్వీకి పెద్దగా ఒరిగేదేమి ఉండదు. మరోవైపు టాలీవుడ్‌లో పోటీ రోజురోజుకు తీవ్రమవుతోంది. మృణాళ్ ఠాకూర్, రష్మిక మందన్న వంటి భామలు వరుసగా హిట్ సినిమాలతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద జెండా పాతేస్తున్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్ మేకర్స్‌కు బెస్ట్ ఆప్షన్‌గా మారుతున్నారు. ఈ పోటీని తట్టుకుని జాన్వీ నిలబడటం కష్టమే అన్న మాట వినిపిస్తోంది. మరి ఈ ఫేజ్ ను దాటి జాన్వీ టాలీవుడ్ తదుపరి అడుగు ఎలా ఉంటుందన్నది చూడాలి.





# మృణాల్ కోరుకుంటోన్న కింగ్ ఆఫ్ రొమాన్స్ ఛాన్స్ ఎవరిదో?

మృణాల్ ఠాకూర్ ఇంతవరకూ ఎవరితోనూ ప్రేమలో పడలేదు. రిలేషన్ షిప్ లో ఉన్నట్లు కథనాలు ఎక్కడా రాలేదు. అమ్మడు దృష్టి అంతా సినిమాలపైనే ఉంది. అందులోనే తాను నటించే సినిమా ఏదైనా? వినూత్నంగా ఉండాలి. అందులోనూ అమ్మడి పాత్ర రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా ఉండాలి. వృత్తి పట్ల ఇంత ప్రొఫెషనల్ గా ఉన్న మృణాల్ వ్యక్తిగత జీవితంలో..అందులోనూ జీవిత భాగస్వామి విషయంలో ఇంకెంత జాగ్రత్తగా...ప్యాషనేట్ గా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. మరి మృణాల్ మనసు దోచుకునే చెలికాడు ఎవరు? అతడు ఎలా ఉండాలి? అంటే అమ్మడి మాటల్ని బట్టి ఓ క్లారిటీ వస్తుంది. జీవిత భాగస్వామి షారూక్ ఖాన్ సినిమాల్లోని రొమాంటిక్ పాత్రల వలె ఉండాలని.. అప్పుడే తాను ప్రేమకు, పెళ్లికి ఓకే చెబుతానని ఓ కామెంట్ విసిరింది. షారుక్ ఖాన్ అంటే నటుడు మాత్రమే కాదు. ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది హృదయాలలో -కింగ్ ఆఫ్ రొమాన్స్-. షారూక్ ఖాన్ తెరపై కనిపించిన తీరు.. పలికించిన హావభావాలు.. హీరోయిన్లను ప్రేమించే విధానం ఎవరినైనా కట్టిపడేస్తాయి. -దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే- నుంచి -దిల్ తో పాగల్ హై-, -వీర్-జారా- వరకు షారుక్ పోషించిన ప్రతి రొమాంటిక్ పాత్ర భావోద్వేగ ప్రయాణం. కళ్లతోనే ప్రేమను పలికించడం, చేతులు చాచే సిగ్నేచర్ పోజ్, ప్రియురాలి కోసం ఎంతకైనా వెళ్లే తత్వం ఇవన్నీ షారూక్ పాత్రల ప్రత్యేకత. నేటి మోడరన్ డేట్స్‌లో ఇలాంటి అరుదైన, స్వచ్ఛమైన ప్రేమను కోరుకోవడం లో మృణాల్ ఆలోచనలో ఎంతటి నిజాయితీ ఉందో అర్థమవుతుంది. మృణాల్ ఠాకూర్ సినిమాల్లో అందమైన అభినయంతో పాటు, పాత్రలకు తగ్గ లోతైన ఎమోషన్స్‌ను పండించడంలో దిట్ట.

నిజ జీవితంలో కూడా మృణాల్ రిలేషన్‌షిప్స్, ప్రేమ పట్ల చాలా క్లారిటీతో ఉన్నారని తెలుస్తోంది. తాత్కాలిక ఆకర్షణల కంటే షారూక్ సినిమాల్లో చూపించే అంకితభావం, నిస్వార్థమైన ప్రేమ, గౌరవం భాగస్వామిలో ఉండాలని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రాక్టికల్ రిలేషన్‌షిప్స్ పెరుగుతున్న తరుణంలో మృణాల్ ఇప్పటికీ ఆ క్లాసిక్, మ్యాజికల్ లవ్‌ను నమ్మడం విశేషం. బాలీవుడ్ నుంచి సౌత్ సినిమా వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్, సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి సాధారణ అమ్మాయిలా కలల రాకుమారుడి గురించి మాట్లాడటం అభిమానులను ఆకట్టుకుంటోంది.

# హొయలు పోతున్న అందాల తృప్తి



యానిమల్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌డం దక్కించుకున్న తృప్తి డిమ్రి ప్రస్తుతం ప్రభాస్‌కి జోడీగా 'స్పిరిట్' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. స్పిరిట్‌తో పాటు ఈ అమ్మడి చేతిలో అరడజను సినిమాలు ఉన్న విషయం తెల్సిందే. వరుసగా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. అంతే కాకుండా ఖాళీ సమయంలో విదేశాల్లో ట్రిప్స్ ను ఎంజాయ్ చేయడం మనం సోషల్ మీడియాలో చూస్తూనే ఉంటాం. తాజాగా ఈ అమ్మడు లాస్ ఏంజిల్స్ వీధుల్లో తిరుగుతూ ఉన్న ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రతిసారి విభిన్నమైన ఔట్ ఫిట్‌ను ధరించి, అందరి చూపు తనవైపుకు తిప్పుకునే ఈ అమ్మడు తాజాగా మరోసారి ఆకట్టుకునే ఫోటో షూట్‌తో మెప్పించింది. తృప్తి డిమ్రి యొక్క అందాల ఆరబోత ఫోటోలు ఎప్పటిలాగే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తృప్తి అక్కడి వీధుల్లో తిరుగుతూ చిల్ అవుతున్న ఈ ఫోటోలకు పాజిటివ్ కామెంట్స్ వస్తున్నాయి. సాధారణంగా చాలా మంది హీరోయిన్స్ ఇలాంటి ఫోటోలను షేర్ చేసిన సమయంలో విమర్శలు ఎదుర్కొంటూ ఉంటారు. ఇలా వీధుల్లో తిరుగుతూ కూడా ఫోటోలు దిగి, షేర్ చేయాలా అంటూ కొందరు కామెంట్స్ చేయడం జరుగుతుంది. అయితే తృప్తికి మాత్రం పాజిటివ్ కామెంట్స్ వస్తున్నాయి. చాలా అందంగా ఉన్నారు. స్పిరిట్ సినిమాలోనూ ఇలాగే కనిపిస్తే చూడాలని ఉంది అంటూ చాలా మంది కామెంట్ చేయడం చూడవచ్చు. మొత్తానికి తృప్తి డిమ్రి ఏం చేసినా, ఎక్కడ ఉన్నా అందరి దృష్టిని ఆకర్షిస్తూ, అందరిని తన వైపుకు తిప్పుకుంటూ ఉంది. సినిమాలతో కంటే ఎక్కువగా ఈ అమ్మడు సోషల్ మీడియాలోని ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA